నేడు జీవీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలున్నా, జీవీఎంసీ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు అందజేయవచ్చునన్నారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీవీఎంసీకి కమిషనర్ వచ్చేనా?

నాలుగు నెలలుగా ఖాళీగా పోస్టు

- భర్తీపై దృష్టి సారించని సర్కారు
- కలెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు
- కొరవడిన పర్యవేక్షణ
- అధికారులు, సిబ్బందిలో నిస్తేజం
- గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపు పొందిన మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు నాలుగు నెలలుగా కమిషనర్ పోస్టును భర్తీ చేయకపోవడం దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు. కలెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా, పనిఒత్తిడితో జీవీఎంసీపై దృష్టిసారించలేకపోతున్నారని, అత్యవసర ఫైళ్లు మినహా మిగిలిన వాటి జోలికి వెళ్లడం లేదని సమాచారం. అంతేకాదు క్షేత్రస్థాయి పర్యటనలు లేకపోవడంతో అధికారులు, కిందిస్థాయి సిబ్బందిలో అలసత్వం పెరిగి నగరంలో పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోందని నగరవాసులు వాపోతున్నారు.



సుమారు 681 చదరపు కిలోమీటర్ల పరిధి, 21 లక్షలకు పైగా జనాభా, ఎనిమిది జోన్లు, రూ.4,500 కోట్లు వార్షిక బడ్జెట్ ఉన్న జీవీఎంసీ రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్. ఇక్కడ ఏటా రూ.వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉండడంతో జీవీఎంసీ కమిషనర్ పోస్టు కోసం ఐఏఎస్ అధికారుల్లో పోటీ ఉంటుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పి.సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ కమిషనర్‌గా నియమించింది. సమర్థ అధికారిగా గుర్తింపు తెచ్చుకోవడంతో మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా ఈ ఏడాది జనవరిలో బదిలీ చేసింది. ఆ స్థానంలో మరో అధికారిని నియమించలేదు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్‌కు తన సాధారణ విధులు నిర్వర్తించడానికే సమయం సరిపోతుండడంతో జీవీఎంసీపై దృష్టిసారించే అవకాశం కనిపించడం లేదు. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే ప్రతి రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, రోడ్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించడం, వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులను తనిఖీ చేసి, అధికారులకు సూచనలు, ఆదేశాలు ఇచ్చే వీలుంటుంది. నగరవాసులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు, తెలుసుకునే అవకాశం లభిస్తుంది. దీనివల్ల అధికారుల్లో జవాబుదారీతనం పెరిగి, సమర్థంగా పని చేస్తారు. కాంట్రాక్టర్లు కూడా పనుల్లో నాణ్యత లోపిస్తే కమిషనర్ బిల్లులను నిలిపివేస్తారని, బ్లాక్‌లిస్టులో పెడతారని భయపడేవారు.

కుంటుపడుతున్న పాలన

జీఈఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్ లేకపోవడంతో క్షేత్రస్థాయి పర్యటనలు లేకుండా పోయాయి. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లు, సిబ్బందిలో అలసత్వం పెరిగి, బాధ్యతలను గాలికి వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా నగరంలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వేసవి ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో జాతీయరహదారి, ఇతర ప్రధాన రహదారుల సెంటర్ మీడియన్లు, గ్రీన్‌బెల్ట్‌లో మొక్కలు చనిపోతున్నాయి. ఉన్న వాటిని సరిగా ట్రిమ్మింగ్ చేయక కళావిహీనంగా గోచరిస్తున్నాయి. మరోవైపు పాలనాపరంగా ఇబ్బందులు తప్పడం లేదు. కలెక్టర్ రోజూ జీవీఎంసీకి వచ్చి సమీక్షలు నిర్వహించడం, పరిపాలనాపరమైన వ్యవహారాలను చక్కదిద్దడం, అధికారులకు ఆదేశాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అత్యవసర ఫైళ్లను మాత్రమే తనవద్దకు తీసుకురావాలని అధికారులకు సూచిస్తున్నారు. దీంతో మిగిలినవి పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. మరోవైపు అధికారులు మొక్కుబడిగా కార్యాలయానికి వచ్చిపోతున్నారు.

ఇద్దరు ఏడీసీలదే భారం

ప్రజారోగ్యం, రెవెన్యూ, వార్డు సచివాలయాల విభాగాలకు అదనపు ఏడీసీగా పనిచేసిన సోమన్నారాయణ బదిలీపై వెళ్లిపోగా ఆ స్థానంలో కొత్తవారిని నియమించలేదు. దీంతో ఇద్దరు ఏడీసీలే అన్ని వ్యవహారాలను చూసుకుంటున్నారు. వారిలో కూడా ఒకరు ఏపనిలోనూ నేరుగా జోక్యం చేసుకోవడం లేదు. దీంతో జీవీఎంసీలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ పోస్టును సత్వరమే భర్తీచేసేలా ప్రభుత్వంపై ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తేవాలని నగరవాసులు కోరుతున్నారు.

కాకి లెక్కలు

చందనోత్సవంపై అధికారుల గారడీ మాటలు

44,384 టికెట్లు అమ్మినట్టు ప్రకటన

- గత ఏడాది కంటే ఎక్కువ ఇచ్చామని వెల్లడి
- అన్నీ తప్పుడు లెక్కలేనంటున్న ప్రజాప్రతినిధులు
- అధికారులపై క్రిమినల్ కేసులు పెడతామన్న త్రిసభ్య కమిటీ

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి):

సింహాచలేశుడి చందనోత్సవంలో అధికారుల తీరు అంతా మాయగా కనిపిస్తోంది. చందనోత్సవం టికెట్ల విక్రయాల్లో అడ్డగోలుగా వ్యవహరించారని, మంగళవారం రాత్రి 11 గంటల వరకు పడిగాపులు పడేలా చేశారని 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించిన కథనంపై ఆలయ ఈఓ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



అప్పన్న నిజరూపం దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు (ఫైల్‌ఫొటో)

గత ఏడాది 32,461 టికెట్లు విక్రయించగా, ఈ ఏడాది 44,384 టికెట్లు ఇచ్చామని పేర్కొన్నారు. రూ.వెయ్యి టికెట్ల కౌంటర్లలో 13,803, ఆన్‌లైన్‌లో 3,999 విక్రయించామన్నారు. వీఐపీ టికెట్లు రూ.1,500 విలువైనవి మూడు వేలు విక్రయించామన్నారు. కానీ వీటిని 2,500 మాత్రమే ముద్రించామని విలేకరుల సమావేశంలో ఈఓ వెల్లడించారు. అదనంగా మరో 500 టికెట్లు ఎలా వచ్చాయో, ఎవరికి ఇచ్చారో వివరించలేదు. ఇక అంతరాలయం టికెట్లు 496 ఇచ్చామన్నారు. ఇవి ప్రొటోకాల్ టికెట్లుగా భావించాలి. రూ.300 టికెట్లు కౌంటర్లలో 15,495, ఆన్‌లైన్‌లో 7,591 మొత్తంగా 23,086 టికెట్లు అమ్మామని ఈఓ తెలిపారు. అన్నిరకాల టికెట్లు 44,384గా లెక్క చూపించారు. చందనోత్సవానికి సిద్ధం చేసిన టికెట్లలో 24వ తేదీనే 14,584, 25న 7,130, 26న 2,939, 28న 8,849, 29న5,417 టికెట్లు విక్రయించామని ప్రకటనలో వివరించారు. అంటే ఆఖరి రోజు వరకు అన్ని టికెట్లు ఉంచుకోలేదని పరోక్షంగా చెప్పే ప్రయత్నం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కూడా టికెట్లు లభించేలా ప్రతి రోజూ విక్రయించామని పేర్కొన్నారు.

అన్నీ అవాస్తవాలే

చందనోత్సవం టికెట్ల విక్రయానికి సంబంధించి ఈఓ సుబ్బారావు విడుదల చేసిన ప్రకటనలో 90 శాతం అవాస్తవాలే ఉన్నాయి. రూ.వెయ్యి ... మిగతా 6వ పేజీలో



నిర్మాణాలను పరిశీలిస్తున్న సీఈ శేఖర్

చందనోత్సవ ఘటనపై దేవదాయశాఖ సీఈ సమీక్ష

సింహాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి):

వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవ వేళ సింహగిరిపై గోడకూలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రసాద్ పథకం కింద నిర్మాణంలో ఉన్న టూరిజం సమాచారం కేంద్రం, క్యూకాంప్లెక్స్, దుకాణ సముదాయం, మల్టీప్లెక్స్ భవనం, కోల్డ్ స్టోరేజి, రెండో ఘాట్‌రోడ్డు సమీపంలోని నిర్మాణాలను టూరిజం, దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శని, ఆదివారాల్లో క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం ఇరుశాఖల ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చందనోత్సవ ఘటనకు కారణమైన గోడ నిర్మాణం తీరున పరిశీలించామన్నారు. ప్రసాద్ పథకం పనుల్లో జాప్యంపై చర్చించామని, లోటుపాట్లపై ప్రత్యేక దృష్టి సారించామని, నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఆయన వెంట పర్యాటక శాఖ ఇంజనీర్లు రమణ, స్వామి, మదన్, దేవదాయశాఖ ఇంజనీర్లు శ్రీనివాసరాజు, రాంబాబు, తదితరులున్నారు.

నగరంలో సమంత

- సందడిగా శుభం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్



శుభం సినిమా ప్రేక్షకుల మోముపై చిరునవ్వు చిందిస్తుందని ప్రముఖ సినీ నటి, చిత్ర నిర్మాత సమంత అన్నారు. ట్రాలాలా విజన్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 9వ తేదీన విడుదల కానుంది. ఇందులో భాగంగా ఆదివారం బీచ్‌రోడ్డులో చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ మజిలీ విడుదల సమయంలో విశాఖ వచ్చానని, మరోసారి ఇక్కడి అభిమానుల మధ్య గడపడం ఆనందంగా ఉందన్నారు.

ప్రశాంతంగా నీట్

- 97.75 శాతం మంది హాజరు
- కేంద్రాలకు ముందుగానే చేరుకున్న అభ్యర్థులు
- క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిబ్బంది
- పర్యవేక్షించిన ఆర్డీవోలు, తహసీల్దార్లు



లాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయం వద్ద బారులుతీరిన అభ్యర్థులు

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి):

వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్) తత్సమాన ప్రవేశాలకు జాతీయ స్థాయి 'నీట్' పరీక్ష ఆదివారం నగరంలోని 16 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 7,344 మంది అభ్యర్థులకు గాను 7,179 మంది (97.75 శాతం) హాజరయ్యారు. నగరంలోని వీఎస్ కృష్ణా కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏయూ ఇంజనీరింగ్, ఆర్ట్స్, ఎంబీఏ కళాశాలలు, కంచరపాలెంలోని రెండు పాలిటెక్నిక్ కళాశాలలు, కేంద్రీయ విద్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు మల్కాపురం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌ను సిటీ కో ఆర్డినేటర్‌గా నియమించారు. కో ఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ కో ఆర్డినేటింగ్ సూపర్‌వైజర్‌గా డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ వ్యవహరించారు. ప్రతి ఎనిమిది సెంటర్లకు ఒకరు చొప్పున ఇద్దరు ఆర్డీవోలు, ప్రతి రెండు కేంద్రాలను ఒక తహసీల్దారు పర్యవేక్షించారు. అభ్యర్థుల వెంట తల్లిదండ్రులు పరీక్ష సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్నారు.



కృష్ణ కళాశాల వద్ద కుమార్తె చెవిదిద్దులు తీసివేస్తున్న తల్లి

సహకరించిన వాతావరణం

నగరంలో ఆదివారం మేఘాలు ఆవరించి చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లగా మారింది. దీంతో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, కేంద్రాల బయట నిరీక్షించిన వారికి ఇబ్బందులు ఎదురుకాలేదు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు ఉదయం 11 గంటల తరువాత అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత అనుమతించలేదు. ప్రధాన గేటు వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీచేశారు. ఎలక్ట్రానిక్ వాచీలు, ఇతర వస్తువులు అనుమతించలేదు. బాలికలకు చెవిదుద్దులు, ముక్కుపుడకలు తొలగించిన తరువాతే పంపారు. కృష్ణాకళాశాల వద్ద ఒక బాలిక ముక్కుపుడక రాకపోయినా అనుమతించారు. ఇదే కేంద్రంలో చివరి నిమిషంలో వచ్చిన అభ్యర్థులను పోలీసులు తమ వాహనాలపై కేంద్రానికి తరలించారు.



భగీరథ విగ్రహావిష్కరణలో మంత్రి సవిత, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ మల్లికార్జున, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

భగీరథ ప్రయత్నంతోనే విజయం

ఏ కార్యక్రమమైనా భగీరథ ప్రయత్నంతో విజయం తథ్యమని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆమె జీవీఎంసీ 71వ వార్డు దుర్గానగర్‌లో ఆవిష్కరించారు. - వార్త 7వ పేజీలో

హౌసింగ్‌లో ముదుర్లు

టీడీపీ కీలకనేత బంధువునంటూ ఒకరి దందా

- ప్రజా ప్రతినిధులంతా తన వారేనని మరొకరు రుబాబు
- హల్‌చల్ చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఈలు



విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి):

హౌసింగ్ కార్పొరేషన్‌లో ఇద్దరు ఏఈల దందాపై జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఈ ఇద్దరు ఏఈలు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువ అధికారం చెలాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగర శివారు ప్రాంతాల్లోని ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించే అవకాశం లబ్ధిదారులకు లేకపోవడంతో వీరు అడ్డగోలుగా వెనకేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో అధికార పార్టీలో కీలక నాయకుడి బంధువునంటూ ఒక ఏఈ హంగామా చేస్తున్నారని సమాచారం. ఇతను పనిచేసే మండలంలో డీఈ లేకపోవడంతో ఆ అధికారాలను కూడా చెలాయిస్తున్నారని తెలిసింది. కాగా ఎంపీ, ఎమ్మెల్యేలంతా తనకు అధిక ప్రాధాన్యత ఇస్తారంటూ ... మిగతా 6వ పేజీలో

పది గట్టెక్కించేలా!

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- జిల్లాలో 3,485 మంది పరీక్ష తప్పిన విద్యార్థులు
- తరగతులకు 40 శాతం మందే హాజరు
- 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



తగరపువలస పాఠశాలలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి):

గతనెలలో విడుదలైన పదోతరగతి ఫలితాల్లో పరీక్ష తప్పిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ దృష్టిసారించింది. ఈనెల 19నుంచి జరగనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫెయిలైన విద్యార్థులకు సన్నద్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలతో జిల్లాలోని 11 మండలాల్లో 22 ఉన్నత పాఠశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గత నెలలో విడుదలైన ఫలితాల్లో జిల్లాలో 3,485 మంది పరీక్ష తప్పారు. వీరందరినీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా సిద్ధం చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వేసవి సెలవుల్లో ప్రతి పాఠశాలలో ... మిగతా 6వ పేజీలో



పూజలందుకున్న గోవిందరాజస్వామి

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవిలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క స్వర్ణ పుష్పంతో అర్చన చేశారు.అనంతరం అదే వేదికపై స్వామివారికి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న నటుడు ఆటో రామ్‌ప్రసాద్



సింహాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి) : సినీ, బుల్లి తెర నటుడు ఆటో రామ్‌ప్రసాద్ వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న రామ్ ప్రసాద్ గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీస్సులీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సింహగిరిపై కానరాని జంతు బలి నిషేధం

సింహాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జంతు బలులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గిరి హిల్‌టాప్ రోడ్డులో ఉన్న గ్రామదేవత సత్తెమ్మతల్లికి స్థానికులు మొక్కుబడిగా కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇస్తున్నారు. దీనిపై జంతు ప్రేమికులు, హైందవ సంప్రదాయపరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ చట్టం ప్రకారం కొండపై జంతు బలులు నిషేధం.కానీ కొందరు భక్తులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం




మధురవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శిల్పారామంలో నగరానికి చెందిన రాజేశ్వరి కూచిపూడి కళామిత్ర బృందం ఆదివారం పలు నృత్యాలు ప్రదర్శించారు. మహాగణపతి ప్రార్థనతో ప్రారంభమై బ్రహ్మ మొక్కటే.. మూషిక వాహన.., చక్కని తల్లికి ఛాంగు భళ.., అదిఅ అల్లదిఅ.., ఏకదంతాయ.. తదితర కీర్తనలకు కళాకారులు నృత్యరీతులు సమకూర్చారు. ఈకార్యక్రమంలో కళాకారులు కృతికవీక్షిత, బాలభార్గవి, విష్ణుసాయి, ప్రియదర్శిని, ఉజ్వల, శ్రీజ, సిద్ధేశ్వర్, హేమస్వరూప్, సాయికౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు పట్ల హర్షం

తగరపువలస, మే 4 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ మతం తీసుకున్న దళితులు అట్రాసిటీ కేసు పెట్టడానికి అనర్హులని హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమని సామాజిక కార్యకర్త, గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తీర్పు వల్ల నిజమైన ఎస్సీలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ అమ్మవారి పండుగ



భీమునిపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబ పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరికిన యల్లయ్య (కింగ్) ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం అనుపోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏడుకొండలరావు, గ్రామ కుల వానుపల్లి నూకరాజు, అచ్యుత్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా జూట్‌మిల్లు క్వార్టర్లు

- కనీస సదుపాయాలు కల్పించని యాజమాన్యం
- మిల్లు మూత తరువాత పరిస్థితి మరింత దయనీయం
- ఇప్పటికే చాలామంది వలస
- కొద్దిమంది కార్మికులు మాత్రమే ఇళ్లల్లో నివాసం
- సౌకర్యాల కల్పనకు విజ్ఞప్తి



కార్మికులు జూట్‌మిల్లు యాజమాన్యం కట్టించిన ఇళ్లు

తగరపువలస, మే 4 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికుల కోసం నిర్మించిన 550 గృహాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో చాలా వరకూ నివశించడానికి వీల్లేకుండా శిథిలమయ్యాయి. మిల్లులో పనిచేసే కార్మికులకు నామమాత్రపు అద్దెతో యాజమాన్యం వీటిని కేటాయించింది. 2009లో మిల్లు మూతపడిన తర్వాత చాలామంది కార్మికులు ఇతర పనుల కోసం వలస వెళ్లిపోయారు. ప్రస్తుతం కొద్దిమంది మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. కార్మికుల కోసం అప్పట్లో వీటిని 11 వరుసల్లో నిర్మించారు. ఇంటికి ఇంటికి మధ్య నడవడానికి రెండు అడుగుల స్థలం కూడా ఉండకపోవడం వల్ల ఇరుగ్గా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటికి వేసిన విద్యుత్ మీటర్లు కూడా యాజమాన్యం తొలగించింది. వీటిలో నివాసం ఉంటున్న చాలామంది కార్మికులు తమకు రావల్సిన పరిహారాల కోసం ఎదురుచూస్తున్నారు. పరిహారాలు అందిస్తే ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా వారసత్వంగా ఒకరి తర్వాత ఒకరు ఈ గృహాల్లో నివాసం ఉంటున్నందున వీరిలో నిరుపేదలకు ప్రభుత్వ పరంగా ఇళ్లు కేటాయిస్తామని కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రకటించాయి కానీ అమలు కాలేదు. కొంతమంది తమ రేషన్‌కార్డుల ఆధారంగా ఇళ్ల స్థలాల కోసం దర ఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. క్వార్టర్లు ఉన్న స్థలం తగరపువలస కూడలిని ఆను కుని మొత్తం ఆరు ఎకరాల్లో ఉంది. దీనికి విలువ కోట్లాది రూపాయల ధర పలుకుతోంది. కార్మికులు ఈ ఇళ్లను ఖాళీ చేస్తే స్థలాన్ని నేలమట్టం చేసి చదును చేసి విక్రయించడానికి మిల్లు యాజమాన్యం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం 200 మంది కార్మికులు క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. మిల్లు మూత పడినందున ఇళ్లు జూట్ స్థలంలో ఉండడంతో జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని గృహాల్లో ఉంటున్నవారు వాపోతున్నారు. స్థలాలు ఖాళీ చేసేంత వరకు కనీస సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేయాలని వారు కోరుతున్నారు.



చెరువు ఆధునికీకరణ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న రవితేజ



చెరువు గట్టుపై పేరుకుపోయిన తుప్పలు

చిల్లపేట చెరువు ఆధునికీకరణకు చర్యలు

టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తగరపువలస, మే 4 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, భీమిలి రహదారి మధ్యలో ఉన్న చిల్లపేట చెరువు ఆధునీక రణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ తెలిపారు. చెరువు దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'తో ఇటీవల వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఆదివారం ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. 36.40 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువును హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని గతంలో ప్రతిపాదనలు తయారు చేసిన విషయాన్ని టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్ట సురేశ్ ఈ సందర్భంగా తెలియజేశారు. పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని, తూర్పు గట్టుపై మట్టి రహదారి మాత్రమే నిర్మించారని చెప్పారు. ఇందుకు సంబంధించి గతంలో తయారు చేసిన బ్లూప్రింటు కాపీని చూపించారు. దీన్ని రవితేజ పరిశీలించి చెరువుకు ఏయే ప్రాంతాల్లో ఏయే పనులు చేయాలన్న విషయాలను నమోదు చేసుకున్నారు. చెరువులో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ చెరువు ఆధునికీకరణ గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పల రమేశ్, నూరిబాబు, నూకరాజు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు



విజయానందపురం జంక్షన్ సమీపంలో శిథిలమైన రోడ్డు

పద్మనాభం, మే 4 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం - పద్మనాభం - శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రాష్ట్ర రహదారి పలుచోట్ల శిథిలం కావడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నేరెళ్లవలస పంచాయతీ పరిధిలోని విజయానందపురం జంక్షన్ (చిన్నాపురం జంక్షన్)లోను, పద్మనాభం జంక్షన్, మద్ది, చిన్నయ్యపాలెం, బాకురుపాలెం తదితర ప్రాంతాల్లో రోడ్డు గుంతలు పడి ఉంది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ పలువురు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా ఈ రోడ్డు దుస్థితి గురించి ఆర్‌అండ్‌బీ డీఈఈ గంగరాజును వివరణ కోరగా రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.3.5 కోట్లు బిల్లులు రావాల్సి ఉందని చెప్పారు. ఆ చెల్లింపులు జరిగిన వెంటనే మిగిలిన పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

నేటి నుంచి అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు

పద్మనాభం, మే 4 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ మహా సంప్రోక్షణ, శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించడానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే యాగశాల హోమ కుండాలు పూర్తయ్యాయి. ఆలయానికి మైనం పాలిష్‌తో పాటు ప్రహరీకి సున్నాలు వేశారు. ఆలయంలో ఫ్లోరింగు పనులు పూర్తయయ్యాయి. విద్యుదీకరణ పనులు చేశారు. 5న కుంభ కళా వాహన కార్యక్రమంతో ఉత్సవానికి శ్రీకారం చుడతారు. ఈమేరకు స్వామివారిని ఆవాహనం చేసిన కలశతో పాటు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీపై మంగళవాయిద్యాల నడుమ వేద పండితుల మంత్రోచ్చారణలతో అనంతుని గిరిపైకి సాయంత్రం 6.30 గం.లకు తీసుకువెళతారు. అక్కడ మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, విశేష అర్చనలు నిర్వహించి 9న ఆలయ శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తారు.

అమనాంలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

భీమునిపట్నం (రూరల్), మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమనాం గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.తొలుత గణపతి సహిత అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం దాతల సాయంతో ధ్వజస్తంభం ఏర్పాటుకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పి. రాజకుమారశాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ ఆదిరెడ్డి, విగ్రహాల దాతలు పోలయ్యరెడ్డి, బి. రమణ, ఎల్. శ్రీనివాసరావు, ఎస్.అప్పారావు బి.అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కుటుంబ సభ్యులతో మంత్రి అచ్చెన్నాయుడు

వెంకన్న సన్నిధిలో మంత్రి అచ్చెన్నాయుడు

సాగర్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్యశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ జగన్మోహనాచార్యులు స్వాగతం పలికారు. అంతరాలయంలో మంత్రి గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భీమిలి బీచ్‌లో సందర్శకుల సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న తీరం

భీమునిపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం సాయంత్రం సందడిగా మారింది. ఇన్నాళ్లు వేసవి తాపంతో అల్లాడిన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో అధిక సంఖ్యలో తీరానికి వచ్చారు. ఇసుక తిన్నెల్లో, సముద్రపు కెరటాల్లో సందడి చేశారు. ఆట, పాటలతో సరదాగా గడిపారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సీపీ శంఖబ్రత బాగ్చీ నుంచి పురస్కారం అందుకుంటున్న సాయి

పద్మనాభం, మే 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో కృష్ణాపురం గ్రామానికి చెందిన స్రింగ్‌ఫీల్డ్ పాఠశాల విద్యార్థి రూ. 5 వేలు నగదు బహుమతి పొందారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న డి. సాయి మోహన్ పాల్గొని ప్రథమ బహుమతి పొందాడు. ఈమేరకు సీపీ, విద్యార్థికి రూ. 5 వేలు నగదు పురస్కారం ఇచ్చి అభినందించారు.

తీర ప్రాంతం రక్షణ పట్ల అప్రమత్తం



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ మురళీకృష్ణ, మత్స్యకారులు

భీమునిపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : దేశ భద్రత విషయంలో మత్స్యకారులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని రుషికొండ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మంగమారిపేట, కాపుల దిబ్బడిపాలెం, పెద్ద ఉప్పాడ గ్రామాల్లో మత్స్యకారులకు దేశ రక్షణ పట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో దేశానికి ఉన్న ముప్పు గురించి వివరించారు. తీర ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు, అపరిచితులు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. సముద్రంలో వేట సమయంలోనే కాకుండా, వేట నిషేధ సమయంలో పడవలు, వలలు మరమ్మతు చేసుకోవడంతో పాటు దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యతను కూడా గుర్తించుకోవాలన్నారు. అనుమానాస్పదంగా మన ప్రాంతంలో తిరిగే నౌకల విషయాన్ని కూడా తెలియజేయాలని కోరారు. ఏదైనా సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 1093, లేదా 9392914706, రుషికొండ మెరైన్ సీఐ 9392914716 నంబర్లకు తెలిపాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ



మధురవాడలో మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందిస్తున్న రవితేజ, జేసీ అశోక్

మధురవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. ప్రమాదంలో చంద్రంపాలెంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ (భార్యభర్తలు) మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షల చొప్పున పరిహారాన్ని ఆదివారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందనోత్సవం నాడు జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్‌డీఓ కె. సంగీత్ మాథుర్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, నాయకుడు పిళ్లా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు అడివివరం గ్రామానికి చెందిన యడ్ల వెంకటరావు భార్య రామలక్ష్మికి జేసీ అశోక్ రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరగా, ఆయన స్పందిస్తూ ఇప్పటికే ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసి విచారణ చేపట్టిందని, కమిటీ ప్రాథమిక నివేదికను అందజేసిందన్నారు. దాని ఆధారంగా బాధ్యులపై చర్యలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సంగీత్ మాథుర్, గంటా రవితేజ, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, లండ శ్రీనివాస్, తాలాడ రామారావు, ,తదితరులు పాల్గొన్నారు.

కాకి లెక్కలు

... 5వ పేజీ తరువాయి

టికెట్లను వందల సంఖ్యలోనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించి మిగిలినవన్నీ బ్లాక్ చేశారు. గత ఏడాది కూడా ఓ ఏఈఓ రూ. వెయ్యి టికెట్లు బ్యాంకులో బ్లాక్ చేశారని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి నాటి కలెక్టర్ మల్లికార్జునకు విలేకరుల సమావేశంలో వివరించగా, విచారణ చేయిస్తామని చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ టికెట్లను బ్లాక్ చేసి అవసరమైన వారికి ఇచ్చుకోవడంలో కమిషనర్ నుంచి ఈవో వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉందని సమాచారం.

ప్రజా ప్రతినిధులకూ చుక్కలే...

కాగా ఈ ఏడాది చందనోత్సవం ముందు రోజు మంగళవారం సాయంత్రం వరకు ప్రజా ప్రతినిధులకు టికెట్లు ఇవ్వలేదు. వారు కోరినన్ని ఇవ్వలేదు సరికదా, అదనంగా అడిగితే ఆ రోజు రాత్రి 11 గంటల వరకు ఈఓ తన కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. డబ్బులు చెల్లించి కొనుక్కునే టికెట్లు ఆన్‌లైన్‌లో, బ్యాంకులో అందుబాటులో ఉంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్ల పీఏలు అక్కడ కాకుండా కలెక్టరేట్, ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఏటా టికెట్లను బ్లాక్ చేసి ఆలయ అధికారులే బ్లాకులో అమ్ముకుంటున్నారు. ఇది వాస్తవం. పత్రికల్లో కథనాలు అవాస్తవమని నిరూపించదలుచుకుంటే మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు ఈఓ కార్యాలయం బయట ఏమి జరిగిందో సీసీ టీవీ ఫుటేజీ బయటపెట్టాలి.

ఇవీ వాస్తవాలు

దేవస్థానానికి భూరి విరాళాలు ఇచ్చేవారికి ఏటా టికెట్లు ఇచ్చేవారు. ఈ సారి ఇవ్వలేదు. గత ఏడాది జీవీఎంసీ కార్పొరేటర్లు ఒక్కొక్కరికి ఐదేసి టికెట్లు ఇచ్చారు. ఈసారి కేవలం రెండు మాత్రమే ఇచ్చారు. ప్రజాప్రతినిధులు కోరినన్ని ఇవ్వలేదు. అందరికీ సమానంగానూ అందించలేదు. విశాఖలో కీలకమైన ఓ ప్రజాప్రతినిధి 80 టికెట్లు అడిగితే 50 మాత్రమే అదీ మంగళవారం మధ్యాహ్నం ఇచ్చారు. మరో 30 కావాలంటే కలెక్టరేట్‌కు, ఈఓ కార్యాలయానికి రాత్రి 11 గంటల వరకు తిప్పించుకొని అప్పుడు ఇచ్చారు. ఓ కార్పొరేషన్ చైర్మన్‌కు కూడా ఇదే అనుభవం ఎదురయింది. దీంతో తాజాగా ఈఓ విడుదల చేసిన ప్రకటన అంతా బూటకమని పీఏలు ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఫోన్‌లో తెలిపారు.

టికెట్లు కావాలని లెటర్ హెడ్‌లపై దరఖాస్తు చేసిన వారందరికీ మంగళవారం సాయంత్రం నుంచి జారీ ప్రారంభించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సులువుగా లభిస్తే వీరంతా ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ చెప్పలేదు. ఈ నేపథ్యంలో తప్పులు చేయడం, సమర్థించుకోవడం సింహాచలం దేవస్థానం అధికారులకు అలవాటుగా మారందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తీరు గమనించిన త్రిసభ్య కమిటీ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

'పది' గట్టెక్కించేలా ?

... 5వ పేజీ తరువాయి

తరగతులు నిర్వహించడం కష్టమైన పని కావడంతో ప్రధాన కూడళ్లలో ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ పాఠశాలకు సమీపంలో మూడు, నాలుగు పాఠశాలల ఉపాధ్యాయులకు విధులు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు మూడు సబ్జెక్టులపై బోధించి, సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో అధికంగా 200 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలతోపాటు సమీపంలో మరో రెండుమూడు పాఠశాలల విద్యార్థులకు కలిపి తరగతులు నిర్వహిస్తున్నారు.

అయితే 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. ఈవారం నుంచి హాజరు సంఖ్య పెరిగేలా చూడాలని హెచ్‌ఎంలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. ప్రతి రోజు ఒకటిలేదా రెండు ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీచేస్తున్నారు. పరీక్షలకు వీలుగా విద్యార్థులను సన్నద్ధంచేయాలని, సందేహాలుంటే నివృత్తిచేయాలని టీచర్లకు సూచించారు. కాగా ఈనెల 19వతేదీ నుంచి 12 కేంద్రాల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈవో తెలిపారు.

హౌసింగ్‌లో ముదుర్లు

... 5వ పేజీ తరువాయి

మరో ఏఈ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని, లేని అధికారాలతో నగర శివారు సెంటు స్థలాల్లో ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని కార్పొరేషన్‌లో పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పనులుచేసిన మేరకు బిల్లులు రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో తాము సూచించిన కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత ఇవ్వాలని సచివాలయాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు. లేఅవుట్‌లలో కొందరు కాంట్రాక్టర్లను పనుల నుంచి తప్పించి, కొత్తవారికి అప్పగించడంలో వీరిద్దరూ ప్రధాన పాత్రపోషించారని సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్లను పట్టించుకోరని, గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి ప్రజాప్రతినిధులకు దగ్గరి వారమంటూ భారీగా ముడుపులు మూటగట్టారని తెలిసింది. ఏఈల దందాపై ఉన్నతాధికారులు దృష్టిసారించి అడ్డుకట్ట వేయాలని ఇళ్ల లబ్ధిదారులతో పాటు నగర వాసులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి) : రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.14,500 విలువైన రెండున్నర కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు.ఎస్ఐలు లక్ష్మి, మిస్త్రీ తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తుండగా తమిళనాడుకు చెందిన శరత్‌కుమార్ (22) తిరుపూర్‌కు గంజాయి రవాణా చేస్తూ దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సీతమ్మధార : గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు నాల్గో పట్టణ పోలీస్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో భోపాల్‌కు చెందిన నలుగురు 14 కిలోల గంజాయిని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఘనంగా నవ్వుల దినోత్సవం

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ (విశాఖపట్నం), లాఫర్స్ ఫన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం, విశాఖ పౌరగ్రంథాలయంలో నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ స్కిట్స్‌తో ఆద్యంతం నవ్వులు పూయించారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంవీ సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్‌రాజు,గణేష్, కుమారి, షణ్ముఖనాయుడు, గోపికృష్ణ, జీవీ లక్ష్మీనరసింగరావు, నిరోషాలు లఘు నాటికలు ప్రదర్శించారు..జడ్జిమెంట్ ప్లీజ్...హింస...ఛానల్ ఓపెన్ అయింది..సూర్య నమస్కారాలు తదితర స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పూయించాయి.ముందుగా అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, పింకీ శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.

మేయర్‌ను కలిసిన అక్కరమాని దంపతులు



మేయర్ పీలా శ్రీనివాసరావును సత్కరిస్తున్న విజయనిర్మల, వెంకటరావు

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాస్‌ను మాజీ వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, టీడీపీ నాయకులు వెంకటరావు దంపతులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధి దిశగా మేయర్‌కు తగిన చర్యలు తీసుకోవాలనా కోరారు. మేయర్‌ను దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అక్కరమాని అవినాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి సమష్టిగా పని చేద్దాం

» పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



మాట్లాడుతున్న కె.కె. రాజు

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన తర్వాత కార్యాచరణతో ముందుకు వెళ్దామన్నారు. పార్టీలో అందరినీ సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తేనే విజయవంతమవుతాయని చెప్పారు. పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, మజ్జి శ్రీనివాసరావు వంటి వారి సలహాలు సూచనలతో వైసీపీని పటిష్ట పరచడంలో ప్రతీ కార్యకర్త అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాణాల శ్రీనివాస్, రవిరెడ్డి, కార్పొరేటర్లు, అనుబంధ సంఘనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. చెన్నైకి చెందిన సోదరీమణులు దీపిక, నందిక త్యాగరాజ కీర్తనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ట్రస్ట్ నిర్వహకులు రాంబాబు, రామగోపాల్, రామకృష్ణరాజు, ఇందిర పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళ దుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడ దుంపలు 34, కంద 80, దేముడుచిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడిఅల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

చేపల బజార్‌లో కనీస సదుపాయాలు కరువు

» పెదజాలారిపేట చేపల మార్కెట్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు
» వినియోగానికి వీలు లేని పరిస్థితి
» పట్టించుకోని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు
» ప్రజా ఆరోగ్య కేంద్రం వద్ద వెలగని హైమాస్టు లైట్లు

పెదవాల్తేరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో గల చేపల మార్కెట్‌లో పరిసరాలు అధ్వానగా ఉన్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు వినియోగానికి ఏ మాత్రం అనువుగా లేవు. ఎన్నో రోజుల నుంచి శుభ్రం చేయకపోవడంతో మరుగుదొడ్లలో అరిశుభ్రత నెలకొంది దీనివల్ల చేపల మార్కుట్ వచ్చే కొనుగోలుదారులు , పరిసర ప్రాంతాల వారు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. పరిసరాలు బాగా లేకపోవడంతో విపరీతంగా దోమలు, ఈగల బెడద ఉందని అంటున్నారు. వీటి వల్ల ఏ వ్యాధులు సంక్రమిస్తాయోనని భయంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చేపల మార్కెట్‌లోని మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అలాగే.. పెదజాలారిపేట చేపల మార్కెట్ ప్రజా ఆరోగ్య కేంద్రం (గీతం ఆస్పత్రి) వద్ద హైమాస్ట్ లైట్స్ కొద్ది నెలల నుంచి వెలగడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సాయంత్రం కాగానే ఆ ప్రాంతంలో చీకట్లు ముసురు కొంటున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండడంతో మందుబాబులు, ఆకతాయిలు చీకటి పడుతూనే ఇక్కడకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఆ సమయంలో



వినియోగానికి ఏ మాత్రం అనువుగా లేని దుస్థితిలో మరుగుదొడ్లు

ఇటు వైపు నుంచి రాకపోకలు సాగించాలంటేనే భయం వేస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీసు అధికారులు కూడా ఇటు పక్క దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

చందనోత్సవ ఘటనలో బాధితులకు చెక్‌ల అందజేత

» మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం



బాధిత కుటుంబాలకు చెక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, జేసీ మయూర్ అశోక్

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : చందనోత్సవం రోజు సింహగిరిపై గోడ కూలిన దుర్ఘటనలో అకాల మరణం చెందిన 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని ఉమానగర్‌కు చెందిన పైలా వెంకటరత్నం, ఆమె ఆడపడుచు గుజ్జరి మహాలక్ష్మిల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించినట్టుగా రూ.25 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆర్డీవో కె.సంగీత్, తహసీల్దార్ రమేష్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చెక్‌లు వెంటనే అందజేసిందన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా త్వరలోనే వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నాలుగు రోజుల్లోనే పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్‌కు మృతుల కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, నారు గోపి, పల్లా ఉమారాణి, చెల్లుబోయిన గోవింద్, సంపంగి సురేష్, కర్రి రవి, పెంటకోట ప్రకాష్, రేమాల సత్యనారాయణ, పార్వతి, సోని అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : సింహాచలం చందనోత్సవంలో గాయపడిన ప్రవీణ్‌కుమార్‌కు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి, జేసీ మయూర్ అశోక్ ఆదివారం రూ.3 లక్షల చెక్‌ను అందించారు. ఆదివారం బాలాజీనగర్‌లో బాధితుడు ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లి అయన ఆరోగ్యంపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.3 లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో చినగదిలి మండల తహసీల్దార్ పాల్ కిరణ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, బీజేపీ నాయకుడు సన్యాసిరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

భగీరథ ప్రయత్నంతో విజయం తథ్యం

» రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత
» దుర్గానగర్‌లో భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత

కూర్మన్నపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): భగీరథ ప్రయత్నంతో ఏ కార్యాన్ని చేపట్టినా.. విజయం తథ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. జీవీఎంసీ 71వ వార్డు దుర్గానగర్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఎంతో శ్రమించి, కఠోర దీక్షతో దివి నుంచి భువికి, అక్కడ నుంచి పాతాళలోకానికి ఆకాశ గంగను తీసుకువచ్చిన ఘనత భగీరథ మహర్షిదన్నారు. ఇక్ష్వాకు వంశానికి చెందిన సగర చక్రవర్తి మనుమడు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలన్నారు. భగీరథ మహర్షి సగర కులంలో జన్మించడం ఆ కులానికే వన్నె తెచ్చిందన్నారు. అతని జయంతిని అధికారకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 లోనే జీవో తీసుకు వచ్చారని గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఇస్తుంద న్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 139 కులాల అభ్యున్నతి కోసం రూ. రెండు వేల కోట్ల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం అధికారకంగా మొదటిసారి గాజువాక నియోజకవర్గంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు, విగ్రహ ఆవిష్కరణ నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యన్నారాయణ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏ. మల్లికార్జున్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, రాష్ట్ర చేనేత కులాల అధ్యక్షుడు పప్పు రాజారావు, కార్పొరేటర్లు రాజాన రామారావు, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండా జగన్, మొల్లి ముత్యాలు, నల్లూరు సూర్యనారాయణ, పప్పు శంకరరావు, కరణం కనకారావు సగర, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

» 50 చోట్ల 28 క్రీడాంశాలలో శిక్షణ

విశాఖపట్నం క్రీడలు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) నిర్వహించనున్న వార్షిక వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) జూన్ గ్యాలియట్ తెలిపారు. ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా సంఘాల సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న శిబిరాలు ఈ నెల 31 వరకు జరుగుతాయన్నారు.

జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో 28 క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో క్రీడాంశానికి సంబంధించి నిపుణులైన కోచ్‌లు, సీనియర్, వెటరన్ క్రీడాకారులు, పీఈటీలు శిక్షణ ఇస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిబిరాలలో మెలకువలు తెలుసుకుని ప్రతిభ కనబరిచిన చిన్నారులను గుర్తిస్తారు. వారికి ప్రత్యేకంగా ఏడాది పొడుగునా ఉచితం గా శిక్షణ ఇస్తారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలనే ఉద్దేశంతో కొన్ని శిక్షణ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్, బాక్సింగ్, ఖోఖో, తైక్వాండో, జూడో, హ్యాండ్‌బాల్ క్రీడాంశాలకు రెండు కేంద్రాలు; బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడలకు నాలుగు; బాస్కెట్‌బాల్‌కు మూడు; ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాలకు ఐదు; హాకీకి మూడు కేంద్రాలు కేటాయించారు. చెస్, సైక్లింగ్, ఫెన్సింగ్, కరాటే, కయాకింగ్, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, యాచింగ్, వెయిట్ లిఫ్టింగ్, వుషు క్రీడాంశాలకు ఒక్కొక్క కేంద్రం కేటాయించినట్లు తెలిపారు.

జూకు రూ.3,37,600 ఆదాయం

ఆరిలోవ, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 3 వేల 982 మంది సందర్శకులు జూ పార్కును సందర్శించినట్లు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

సందర్శకుల నుంచి సుమారు 3 లక్షల 37 వేల 600 రూపాయలు సమకూరినట్టు ఆమె తెలిపారు.

యువత శారీరక సామర్థ్యంపై దృష్టి సారించాలి

» ఏయూ వీసీ రాజశేఖర్



ఫిట్ ఇండియాలో భాగంగా నిర్వహించిన సైక్లింగ్‌లో పాల్గొన్న వీసీ

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామాన్ని జీవితంలో యువతరం తమ జీవతంలో అంతర్భాగంగా చేసుకోవాలని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఏయూ పరిపాలన భవనం వద్ద యూజీసీ ఆదేశాలతో ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మిషన్‌లో భాగంగా యూజీసీ యువతలో శారీరక వ్యాయామం, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యూజీసీ అందిస్తున్న సూచనలను స్వీకరిస్తూ ఏయూలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 'ఫిట్నెస్ కా డోస్-ఆధాగంట రోజ్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్టు చెప్పారు. వివిధ పోటీ పరీక్షలతో తలమునకలై ఉండే యువత నిత్యం తమ సమయాన్ని శారీరక వ్యాయామానికి సైతం కేటాయించాలని సూచించారు. తద్వారా వారికి మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడం, శారీరక, మానసిక ఆరోగ్య పటిష్ఠం అవుతుందన్నారు. ప్రస్తుతం పౌరులు ఒత్తిడితో కూడిన జీవనాన్ని సాగిస్తున్నారని, దీని నుంచి బయటపడడానికి వ్యాయామం ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఏయూ క్రీడా విభాగం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోమన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ యువతతో పాటుఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు నగరానికి చెందిన క్రీడాకారులు, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఏయూ పరిపాలన భవనం నుంచి ప్రారంభమైన ఈ సైక్లింగ్ కార్యక్రమం సిరిపురం కూడలి మీదుగా ఏయూ పరిపాలన భవనం వరకు సాగింది.

శ్రీకాంత్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శిలాఫలకం ఆవిష్కరణ

ఆరిలోవ, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు పరిధికి చెందిన శ్రీకాంత్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శిలా ఫలకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కాలనీకి అప్పటి జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ పేరిట ఈ కాలనీ వాసులు శ్రీకాంత్ నగర్‌గా నామకరణం చేశారు. మొత్తం శ్రీకాంత్ నగర్‌లో 18 వీధులు ఉన్నాయి. బీఆర్టీఎస్ రోడ్లు వేసినప్పుడు ఇల్లు కోల్పోయిన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చారని వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. ఈ కాలనీలో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, కార్యదర్శి యలమల సురేష్, నేతలు తురకపుడి బాలస్వామి, మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

వాంబే గృహం గోడ తొలగింపుపై నిరసన

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలోని వాంబే గృహం గోడను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలిగించడంపై రజక సేవా సంఘం సభ్యులు ఆదివారం నిరసన తెలిపారు. పద్నాలుగు ఏళ్ల కిందట ప్రభుత్వం రజకులకు వాంబే గృహాలు కేటాయించిందని, అప్పటి నుంచి ఉన్న గోడపై ఇప్పుడు టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి వచ్చిన అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన పార్టీపై ఉన్న అభిమానంతో పీతల మూర్తి ఎవరో తెలియకపోయినా అతడిని గెలిపించడానికి పని చేశామన్నారు. ఆయనే సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి జ్యోతితో గోడ కూలగొట్టించారని ఆరోపించారు. మూర్తి యాదవ్ గెలుపు కోసం మేము పనిచేస్తే మా పైనే కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, 22వ వార్డులో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా నిర్మాణాల జోలికి వెళ్లని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వాంబే వాసులు ఏర్పాటు చేసుకున్న చిన్న గోడపై ప్రతాపం చూపించడం అన్యాయం అన్నారు. నాలుగు అడుగులు లేని ప్రహరీని తొలిగించేందుకు ఏకంగా ఎక్స్‌కవేటర్‌నే తీసుకొచ్చి నివాసులను భయభ్రాంతులకు



గోడ తొలగించిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న బాధితులు

గురి చేయడం సమంజసం కాదన్నారు. గోడను తొలగించడమే కాకుండా బాల్కనీని కింద చేసిన నిర్మాణం మీరు తొలగించాలని లేదంటే సోమవారం ఇంటినే కూల్చేస్తామని హెచ్చరించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే వాంబే గృహ సముదాయానికి ఆనుకుని అపార్ట్‌మెంట్లు ఉన్నాయని, అవీ వాంబే గృహాల కంటే దారుణంగా రోడ్డు మీదకు ఉన్నా అధికారులకు కనిపించక పోవడం దారుణమన్నారు. వాటి జోలికి మాత్రం వెళ్లకుండా తమ వంటి పేదలు ఉండే ప్రభుత్వ గృహాలపై చర్యలు తీసుకోవడం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తగదని పేర్కొంటున్నారు.

శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఉద్యోగుల సహకారం కీలకం

» ఏయూ వీసీ రాజశేఖర్
» ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ సిబ్బంది సేవలు ఎంతో కీలకంగా నిలుస్తాయని వీసీ జీపీ రాజశేఖర్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ పరిపాలన భవన సిబ్బంది పాల్గొని నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. జిమ్నాసియం మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూ ఉద్యోగులు ప్రతి వారం ఇటువంటి క్రీడా, వ్యాయామ సంబంధ కార్యక్రమాల్లో భాగం కావాలని సూచించారు. తద్వారా వారి ఆరోగ్యం మెరుగవుతుందని, సమర్థవంతమైన సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు. ఉద్యోగులంతా తమకు నచ్చిన క్రీడాంశంలో రాణించాలని, శారీరక వ్యాయామాన్ని నిత్య జీవితంలో అంతర్భాగంగా మార్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. క్రీడా విభాగం సంచాలకుడు ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, ఆచార్యులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేస్తూ శతాబ్ది ఉత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తారన్నారు. శారీరక ఆరోగ్యం, వ్యాయామం పట్ల ఉద్యోగులు అవగాహన పెంచుకుంటున్నారని నిత్యం తమ క్రీడా మైదానాల్లో ఏయూ ఉద్యోగులు కనిపిస్తారన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఏయూ పరిపాలన భవనంలో పని చేస్తున్న సిబ్బంది ఆరు జట్లుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, డీసీఎంఎస్ విభాగాధిపతి జాలాది రవి, ఫైనాన్స్ అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఏయూ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తీర భద్రత పోలీసుల ఆధ్వర్యంలో మత్స్యకారులకు వైద్య శిబిరం

ఎంవీపీ కాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామల వారికి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి సహకారంతో జాలారి ఎండాడ, వాసవానిపాలెం మత్స్యకారులు సుమారు రెండు వందల మందికి వివిధ వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కోస్టల్ సెక్యూరిటీ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపినాథ్ జెట్టి ఆదేశాలమేరకు నిర్వహించిన శిబిరంలో అదనపు ఎస్పీ జి.మధుసూదనరావు, నార్త్ సబ్ డివిజనల్ అధికారి బి.నాగేశ్వరరావు, పోర్టు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో నిర్వహిస్తున్న దృశ్యం

పెదవాల్తేరు రైతుబజార్‌లో ఆటో డ్రైవర్ల మధ్య కొట్లాట

» సరకు అన్‌లోడ్ విషయంలో వివాదం
» ఓ ఆటో డ్రైవర్‌పై దాడి
» పోలీసులకు ఇరు వర్గాల ఫిర్యాదు



రైతుబజార్‌లో ఆటోడ్రైవర్ల వాగ్వాదం



గాయపడిన ఆటోడ్రైవర్ పైడిరాజు

పెదవాల్తేరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెదవాల్తేరు రైతుబజారుకు పండ్లను తీసుకొచ్చిన ఆటో డ్రైవరు, కూరగాయలు తీసుకొచ్చిన ఆటో డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అనందపురం ప్రాంతానికి చెందిన కొందరు రైతులు ఆదివారం ఉదయం ఒక ఆటోలో రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చారు. అలాగే పూర్ణా మార్కెట్ నుంచి పండ్ల వ్యాపారులు పండ్లను మరో ఆటోలో తీసుకొచ్చారు. అయితే అక్కడి నిబంధనలకు విరుద్ధంగా ముందు వచ్చిన ఆటోలో సరుకును కాకుండా తర్వాత వచ్చిన ఆటోలో సరుకును కలాసీలు దించడంతో వివాదం మొదలైంది. సరుకు దించే విషయంలో ఇద్దరు ఆటో డ్రైవర్లు కలహించుకున్నారు. ఈ క్రమంలో పూర్ణా మార్కెట్ నుంచి పండ్లు తీసుకొని వచ్చిన ఆటో డ్రైవర్ కొంతమంది తన స్నేహితులను తీసుకొచ్చి ఆనందపురం నుంచి కూరగాయలు తెచ్చిన ఆటోడ్రైవర్ పైడిరాజుపై దాడి చేయించాడు. ఈ దాడితో పైడిరాజు గాయపడ్డాడు. దీనిపై పైడిరాజు మూడో పట్టన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే పూర్ణా మార్కెట్ నుంచి పండ్లు తెచ్చిన ఆటో డ్రైవర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని, విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని త్రీ టౌన్ పోలీసుస్టేషన్ సీఐ పైడయ్య తెలిపారు. కాగా రైతు బజార్‌లో ఇంత వివాదం జరుగుతున్నా ఎస్టేట్ అధికారి సత్యకళ స్పందించడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనకేమీ సంబంధం లేనట్టుగా ఆమె వ్యవహరించారంటూ బజార్‌లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలోనే జోక్యం కల్పించుకొని ఉంటే ఈ వివాదం జరిగేది కాదని, ఆమె బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని మండిపడుతున్నారు.

‘20న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి’

మహారాణిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని విశాఖ పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘాలు కోరాయి. ఆదివారం సీఐటీయూ భవన్‌లో విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమ్మె హక్కును నిర్వీర్యం చేసే లేబర్ కోడ్స్ ప్రమాదకరమైనవని అన్నారు. ఇవి అమలైతే సమ్మె చేయడం చట్టవ్యతిరేక చర్య అవుతుందని తెలిపారు. చట్టాలు మార్చాలంటే పార్లమెంట్‌లో చేయాలి. కానీ రాష్ట్రాలకు ఇష్టం ఉంటే మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. లేబర్ కోడ్‌లు వస్తే ఇప్పుడు ఉన్న కార్మిక చట్టాలు అన్నీ పోయినట్లేనని తెలిపారు. ఈ సమావేశంలో విశాఖ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ డి.వి.రమణ

సీతమ్మధార/మహారాణిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు రౌడీషీటర్లను హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఆదివారం వారిని పిలిపించి దినచర్యపై ఆరా తీశారు. ప్రజలకు అశాంతి కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పి.డి. చట్టం అమలు చేస్తామని హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లోనూ ఇన్‌స్పెక్టర్ డి.వి.రమణ కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, క్రమశిక్షణ తప్పి మళ్లీ అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మీ కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందని, మంచిగా ప్రవర్తిస్తే రౌడీషీట్లను మూసి వేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. నేర జీవితాన్ని వదిలేసి కుటుంబంతో మంచి నడవడికతో ఉంటే పోలీస్ శాఖ సహకరిస్తుందని అన్నారు.

మేడే సాంస్కృతిక ఉత్సవాలు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): మేడే సాంస్కృతిక ఉత్సవాలు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఎం.భాస్కరరావు హాజరై మాట్లాడారు. కళల్లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించాలన్నారు. ఏవీకే ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యం, లఘునాటికలు, మేడే పాటపై నృత్య రూపకం, కోలాటం, సినీ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణ, గ్రంథాలయ సేవా సంస్థల అధ్యక్షుడు బీఎల్ నారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలు ప్రదానం చేశారు.

మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ మహిళను వినయ్ అనే వ్యక్తి నమ్మించి మోసగించాడని సీఐ సత్యనారాయణ తెలిపారు. వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి డార్మెటరీకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. కంచరపాలెం కొత్తూరులో ఉంటున్న ఆ మహిళకు 2015లో వివాహంకాగా, కొద్ది కాలం తర్వాత పెద్దల సమక్షంలో ఆ దంపతులు విడిపోయారన్నారు.

గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.14,500 విలువైన 2 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు కేటీఆర్.లక్ష్మి, మిస్త్రీ తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన శరత్‌కుమార్ (22) అనే నిందితుడు తిరుపూర్‌కు గంజాయి రవాణా చేస్తూ దొరికాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నలుగురు భోపాల్‌వాసుల అరెస్ట్

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు నాల్గో పట్టణ పోలీస్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో భోపాల్‌కు చెందిన నలుగురు 14 కిలోల గంజాయిని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే సారూ.. సమస్యలు పరిష్కరించరూ!



స్థానికులతో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ పరిధి 50వ వార్డు వంశీనగర్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఆదివారం పర్యటించి స్థానికుల ఇబ్బందుల్ని తెలుసుకున్నారు. వంశీనగర్ మీదుగా పారుతున్న గెడ్డ తరుచూ పొంగిపొర్లుతూ నివాసిత ప్రాంతాల వారికి చుక్కలు చూపిస్తోంది. రెండేళ్ల కిందట కూడా ఒక్క రోజు కురిసిన భారీ వర్షం ప్రభావంతో గెడ్డ పక్కగా పార్క్ చేసిన కార్లు కొట్టుకుపోయాయి. స్థానికులకు సెల్లార్ పార్కింగ్ లేని పాత ఇళ్ల యజమానుల వాహనాలు సాధారణంగా గెడ్డ పక్కగా రోడ్డుపైనే నిలుపుతారు.. అయితే వంశీనగర్‌లో పార్క్ చేసే వాహనాలకే కాదు.. ఆటలాడే చిన్నారులకు, వాహనదారులకు, నివాసితులకు భద్రత లేని పరిస్థితి నెలకొంది. మాధవధార ఎగువ ప్రాంతాల నుంచి పారుతున్న గెడ్డ ఇక్కడ హైవే పక్కన జామ్ అయిపోతుంది. ఇటీవల చేపట్టిన పునర్నిర్మాణ పనుల్లో గెడ్డ బేస్‌మెంట్ ఎత్తు చేయడం కారణంగానే దిగువ పైపులైన్లకు అనుసంధానం మూసుకుపోయి, చెత్త చెదారాలు, మురుగు నీరు నేరుగా నివాసిత కాలనీని, హైవే రోడ్డును ముంచెతుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గెడ్డను పరిశీలించిన ఆయన ఈ సమస్యపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, స్థానికులతో ఓ కీలక సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పర్యటనలో వంశీనగర్ నివాసిత సంఘం సభ్యులు ధనుంజయ్, అచ్చిబాబు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

‘దాసరి, మానికొండల మధ్య సారూప్యత’



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబీ వర్ధన్, చిత్రంలో రమణమూర్తి, మిర్యాల వెంకటరావు తదితరులు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు దాసరి నారాయణరావు, సుప్రసిద్ధ పాత్రికేయుడు మానికొండ చలపతిరావుల మధ్య సామాజికంగా ఒకే సారూప్యత ఉందని ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబీ వర్ధన్ అన్నారు. ఆదివారం పౌరగ్రంథాలయంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో దాసరి జయంతి వేడుకలు, మానికొండ చలపతిరావు పుస్తక పరిచయ సభ జరిగింది. కుల వివక్షపై దాసరి రచించిన ‘ఒసేయ్ రాములమ్మ’ చిత్రంలోని ‘చౌదరి గారు..రాయుడు గారు’ పాటతో సభాకార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాబీ వర్ధన్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛ మనిషి ప్రాణం వంటిదని అప్పటి ప్రధాని నెహ్రూ భావించి నేషనల్ హెరాల్డ్ పత్రికను చలపతిరావుకు అప్పగించారన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో నేషనల్ హెరాల్డ్ అగ్రస్థానంలో ఉండేదన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చలపతిరావు ఆ పత్రికలో అక్షరాలు సంధించారని గుర్తు చేశారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో నెహ్రూ గోడ దూకుతున్నట్లు ప్రచురించడంతో అప్పట్లో అది వివాదాస్పదమైందని చెప్పారు. గోడ దూకితే అలా ఉంటానా? అని నెహ్రూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు. పత్రికలో ఎప్పుడు ఉంటామో, లేదో అని చలపతిరావు రాజీనామా పత్రాన్ని జేబులో పెట్టుకుని పని చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల వెంకటరావు, కటారి అప్పారావు, సాగర్‌కుమార్, రామకృష్ణారావు, వీవీ రమణమూర్తి, కె.రమణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి, పిలానిల తిలక్ పాల్గొన్నారు.

రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా నీట్



కెమికల్ కళాశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



తాటిచెట్లపాలెంలో పరీక్ష కేంద్రం ఎదుట తల్లిదండ్రులతో విద్యార్థులు

కంచరపాలెం/అక్కయ్యపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం (వాల్తేరు)లో ఆదివారం నీట్ ప్రశాంతంగా జరిగింది. నిబంధనల ప్రకారం విద్యార్థులు ఉదయం 11 గంటల సమయానికే కేంద్రాలకు చేరుకున్నారు. విస్తృత తనిఖీల అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్, ప్లాంక్, ఫోల్డర్, చెవి రింగులు తదితర వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. కంచరపాలెం కేంద్రానికి 480 మంది విద్యార్థులను కేటాయించగా వారిలో 471 మంది హాజరయ్యారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. తమ పిల్లలు పరీక్ష గదుల్లో రాస్తుంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు తల్లిదండ్రులు ఆత్రుతగా ఎదురుచూశారు. కేంద్రాన్ని పర్యవేక్షించిన వారిలో డిప్యూటీ సూపరింటెండెంట్ దామోదర్, ఇతర అధికారులు ఉన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగ్రదాడి హేయమైన చర్య



ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పిస్తున్న కళాకారులు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): ముష్కరులు అమాయక పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్యగా పలువురు వక్తలు ఖండించారు. భారత శక్తిని నేరుగా ఎదుర్కోలేని పాకిస్థానీయులు చేస్తున్న ఇటువంటి చర్యలను ప్రపంచంలో ఎవరూ కూడా సమర్థించరన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు, సింహాచలం కొండపై గోడ కూలి మృతి చెందిన ఏడుగురికి విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆదివారం సింధూర ఫంక్షన్ హాల్లో నివాళులర్పించింది. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉగ్రదాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. పర్యాటకులు, సామాన్య ప్రజలపై ఉగ్రవాదులు దాడులు చేయడం బాధాకరమన్నారు. మానవత్వంగల ఏ ఒక్కరూ ఇటువంటి చర్యలను సమర్థించరన్నారు. తీవ్రవాదాన్ని అణిచి వేయడానికి ప్రపంచంలోని అత్యధిక దేశాలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు, గాయకుడు కె.జనార్దన్, వర్రె నాంచారయ్య, యాద్‌కుమార్, మనోహర్ ప్రసాద్, ధనుంజయ్, రాథో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని మృతికి సంతాపం



న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న మాటూరి గిరిజ ప్రియదర్శిని ఆదివారం హైదరాబాద్‌లో అకాల మరణం చెందడం విచారకరమని ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్ అన్నారు. ఆమె వివిధ కోర్టుల్లో జిల్లా జడ్జిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ బీవీకే చాంబర్స్‌లో ఆమె సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో హైకోర్టులో రాజ్యాంగబద్ధంగా తీర్పులను ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఆమె మరింత అత్యున్నత స్థానానికి ఎదుగుతారని ఆశించామని, కానీ ఆమె అకాల మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వాగుపల్లి చిన్నారావు, డా.టి.బోసుబాబు, పాకా సత్యనారాయణ, లాయర్స్ ఫోరం ఫర్ జస్టిస్ గుడివల్లి సుబ్బారావు, నిమ్మకాయల ఈశ్వరరావు, సి.రవి, పడమట సురేష్, కోమల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ్వుల దినోత్సవం



జడ్జిమెంట్ ప్లీజ్ స్కిట్ ప్రదర్శనలో హాస్యకళాకారులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ (విశాఖపట్నం), లాఫర్స్ ఫన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం, విశాఖ పౌరగ్రంథాలయంలో నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ స్కిట్స్‌తో ఆద్యంతం నవ్వులు పూయించారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, గణేష్, కుమారి, షషుమినాయుడు, గోపికృష్ణ, జీవీ లక్ష్మీ నరసింగరావు, నిరోషాలు లఘు నాటికలు ప్రదర్శించారు...జడ్జిమెంట్ ప్లీజ్...హింస...ఛానల్ ఓపెన్ అయింది..సూర్య నమస్కారాలు తదితర స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పూయించాయి. ముందుగా అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, పింకీ శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. తదుపరి అతిథుల చేతులమీదుగా మెమెంటోలు అందజేశారు. నవ్వుల ప్రియులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు ఎన్‌సీసీ క్యాడెట్లు



శిక్షణ తరగతులకు వెళ్లిన ఎన్‌సీసీ క్యాడెట్లు

అక్కయ్యపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 23 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఆదివారం విజయనగరం సమీపంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులకు వెళ్లారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్ నేతృత్వంలో పది రోజులు జరగనున్న శిక్షణ తరగతుల్లో ఎల్‌బీ కాలేజీ ఎన్‌సీసీ అధికారి బ్రహ్మానందరెడ్డి, సుబేదార్ మేజర్ జయప్రకాశ్, హవల్దార్ శ్యామలరావు పాల్గొన్నారన్నారు. ఈ తరగతుల్లో వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్ డ్రిల్, మిలిటరీ హిస్టరీ, హెల్త్, హైజీన్ వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి ప్రత్యక్షంగా 22 డీలక్స్ రైఫిల్‌తో ఫైరింగ్ ఉంటుందని, ఇందులో ప్రతిభావంతులకు ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం రోజున క్యాంప్‌నకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లను హెచ్‌ఎం బి.లక్ష్మీనరస అభినందించారు.

‘మా ఆధీనంలో భూములపై హక్కులు వారివా’?



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్వరమెట్ట అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 33వ వార్డులోని వెంకటేశ్వరమెట్టపై 1450, 1261 సర్వే నెంబర్లతో ఉన్న భూముల ఆధారంగా సుమారు వందేళ్లుగా జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ఆ స్థలాలు తమవంటూ దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఒత్తిళ్లు రావడంతో చాలా ఆందోళన చెందుతున్నామని వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమలాదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దీనిపై స్పందిస్తూ ఈ సమస్యపై రెండుసార్లు అంసెబ్లీలో మాట్లాడానని, దేవదాయ మంత్రితో కూడా చర్చించామన్నారు. ఈ సమస్య ఆరునెలల్లో పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు భీశెట్టి శ్రీనివాస్, శరగడం పెద్ద, యల్లపు గోపాలరావు, కోరుబిల్లి ఆది, శ్యాము, గోవిందరావు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఇకపై కూల్..కూల్‌గా ట్రాఫిక్ విధులు



డాబాగార్డెన్స్ సర్కిల్‌లో చల్లదనాన్ని అందించే జాకెట్లు ధరించి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు భానుడు రోజురోజుకు భగభగమండుతున్న నేపథ్యంలో కాసేపు ఎండలోకి వెళ్లాలంటేనే ప్రజలు జడిసిపోతుంటారు. అలాంటిది ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా ఎండవేడిమిని తట్టుకుంటూ .తీవ్ర ఉక్కపోతను భరిస్తూనే ట్రాఫిక్ పోలీసులు నడిరోడ్లపై విధులు నిర్వహిస్తుంటారు. ఎండ వేడిమి తట్టుకోలేక తీవ్ర అలసట చెందుతుంటారు. వీరి అవస్థలను గమనించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హరియాణా రాష్ట్రం గుర్‌గావ్ నుంచి కూల్ జాకెట్లను తెప్పించారు. ఇందులో భాగంగా ఆదివారం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను సారథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి జాకెట్లు ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు వీటిని ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు అందజేశామన్నారు. ఎండ నుంచి ఉపశమనంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు రక్షణగా కూడా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. జాకెట్ లోపల థర్మాకూల్ ఉండటంతో మూడు గంటల పాటు చల్లదనం నిలిచి ఉంటుంది.

కాకి లెక్కలు

... 5వ పేజీ తరువాయి

టికెట్లను వందల సంఖ్యలోనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించి మిగిలినవన్నీ బ్లాక్ చేశారు. గత ఏడాది కూడా ఓ ఏఈఓ రూ.వెయ్యి టికెట్లు బ్యాంకులో బ్లాక్ చేశారని ‘ఆంధ్రజ్యోతి’ ప్రతినిధి నాటి కలెక్టర్ మల్లికార్జునకు విలేకరుల సమావేశంలో వివరించగా, విచారణ చేయిస్తామని చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ టికెట్లను బ్లాక్ చేసి అవసరమైన వారికి ఇచ్చుకోవడంలో కమిషనర్ నుంచి ఈవో వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉందని సమాచారం.

ప్రజా ప్రతినిధులకూ చుక్కలే...

కాగా ఈ ఏడాది చందనోత్సవం ముందు రోజు మంగళవారం సాయంత్రం వరకు ప్రజా ప్రతినిధులకు టికెట్లు ఇవ్వలేదు. వారు కోరినన్ని ఇవ్వలేదు సరికదా, అదనంగా అడిగితే ఆ రోజు రాత్రి 11 గంటల వరకు ఈఓ తన కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. డబ్బులు చెల్లించి కొనుక్కునే టికెట్లు ఆన్‌లైన్‌లో, బ్యాంకులో అందుబాటులో ఉంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్ల పీఏలు అక్కడ కాకుండా కలెక్టరేట్, ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఏటా టికెట్లను బ్లాక్ చేసి ఆలయ అధికారులే బ్లాకులో అమ్ముకుంటున్నారు. ఇది వాస్తవం. పత్రికల్లో కథనాలు అవాస్తవమని నిరూపించదలుచుకుంటే మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు ఈఓ కార్యాలయం బయట ఏమి జరిగిందో సీసీ టీవీ ఫుటేజీ బయటపెట్టాలి.

ఇవీ వాస్తవాలు

దేవస్థానానికి భారీ విరాళాలు ఇచ్చేవారికి ఏటా టికెట్లు ఇచ్చేవారు. ఈ సారి ఇవ్వలేదు.గత ఏడాది జీవీఎంసీ కార్పొరేటర్లు ఒక్కొక్కరికి ఐదేసి టికెట్లు ఇచ్చారు. ఈసారి కేవలం రెండు మాత్రమే ఇచ్చారు. ప్రజాప్రతినిధులు కోరినన్ని ఇవ్వలేదు. అందరికీ సమానంగానూ అందించలేదు. విశాఖలో కీలకమైన ఓ ప్రజాప్రతినిధి 80 టికెట్లు అడిగితే 50 మాత్రమే అదీ మంగళవారం మధ్యాహ్నం ఇచ్చారు. మరో 30 కావాలంటే కలెక్టరేట్‌కు, ఈఓ కార్యాలయానికి రాత్రి 11 గంటల వరకు తిప్పించుకొని అప్పుడు ఇచ్చారు. ఓ కార్పొరేషన్ చైర్మన్‌కు కూడా ఇదే అనుభవం ఎదురయింది. దీంతో తాజాగా ఈఓ విడుదల చేసిన ప్రకటన అంతా బూటకమని పీఏలు ఆదివారం రాత్రి ‘ఆంధ్రజ్యోతి ప్రతినిధి’కి ఫోన్‌లో తెలిపారు.

టికెట్లు కావాలని లెటర్ హెడ్‌లపై దరఖాస్తు చేసిన వారందరికీ మంగళవారం సాయంత్రం నుంచి జారీ ప్రారంభించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సులువుగా లభిస్తే వీరంతా ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ చెప్పలేదు. ఈ నేపథ్యంలో తప్పులు చేయడం, సమర్థించుకోవడం సింహాచలం దేవస్థానం అధికారులకు అలవాటుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తీరు గమనించిన త్రిసభ్య కమిటీ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

‘పది’ గట్టెక్కించేలా!

... 5వ పేజీ తరువాయి

తరగతులు నిర్వహించడం కష్టమైన పని కావడంతో ప్రధాన కూడళ్లలో ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ పాఠశాలకు సమీపంలో మూడు, నాలుగు పాఠశాలల ఉపాధ్యాయులకు విధులు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు మూడు సబ్జెక్టులపై బోధించి, సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో అధికంగా 200 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలతోపాటు సమీపంలో మరో రెండుమూడు పాఠశాలల విద్యార్థులకు కలిపి తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. ఈవారం నుంచి హాజరు సంఖ్య పెరిగేలా చూడాలని హెచ్‌ఎంలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. ప్రతి రోజు ఒకటిలేదా రెండు ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీచేస్తున్నారు. పరీక్షలకు వీలుగా విద్యార్థులను సన్నద్ధంచేయాలని, సందేహాలుంటే నివృత్తిచేయాలని టీచర్లకు సూచించారు. కాగా ఈనెల 19వతేదీ నుంచి 12 కేంద్రాల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈవో తెలిపారు.

హౌసింగ్‌లో ముదుర్లు

... 5వ పేజీ తరువాయి

మరో ఏఈ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని, లేని అధికారాలతో నగర శివారు సెంటు స్థలాల్లో ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని కార్పొరేషన్‌లో పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పనులుచేసిన మేరకు బిల్లులు రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో తాము సూచించిన కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత ఇవ్వాలని సచివాలయాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు. లేఅవుట్‌లలో కొందరు కాంట్రాక్టర్లను పనుల నుంచి తప్పించి, కొత్తవారికి అప్పగించడంలో వీరిద్దరూ ప్రధాన పాత్రపోషించారని సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్లను పట్టిచుకోరని, గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి ప్రజాప్రతినిధులకు దగ్గరి వారమంటూ భారీగా ముడుపులు మూటగట్టారని తెలిసింది. ఏఈల దందాపై ఉన్నతాధికారులు దృష్టిసారించి అడ్డుకట్ట వేయాలని ఇళ్ల లబ్ధిదారులతో పాటు నగర వాసులు కోరుతున్నారు.

మేయర్‌ను కలిసిన అక్కరమాని దంపతులు



మేయర్ పీలా శ్రీనివాసరావును సత్కరిస్తున్న విజయనిర్మల, వెంకటరావు

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాస్‌ను మాజీ వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, టీడీపీ నాయకులు వెంకటరావు దంపతులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధి దిశగా మేయర్‌కు తగిన చర్యలు తీసుకోవాలనా కోరారు. మేయర్‌ను దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అక్కరమాని అవినాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి సమష్టిగా పని చేద్దాం

» పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



మాట్లాడుతున్న కె.కె. రాజు

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన తర్వాత కార్యచరణతో ముందుకు వెళ్దామన్నారు. పార్టీలో అందరినీ సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తేనే విజయవంతమవుతాయని చెప్పారు. పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, మజ్జి శ్రీనివాసరావు వంటి వారి సలహాలు సూచనలతో వైసీపీని పటిష్ట పరచడంలో ప్రతీ కార్యకర్త అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాణాల శ్రీనివాస్, రవిరెడ్డి, కార్పొరేటర్లు, అనుబంధ సంఘనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. చెన్నైకి చెందిన సోదరీమణులు దీపిక, నందిక త్యాగరాజ కీర్తనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ట్రస్ట్ నిర్వహకులు రాంబాబు, రామగోపాల్, రామకృష్ణరాజు, ఇందిర పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 34, కంద 80, దేముడుచిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడిఅల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

చేపల బజార్‌లో కనీస సదుపాయాలు కరువు

» పెదజాలారిపేట చేపల మార్కెట్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు
» వినియోగానికి వీలు లేని పరిస్థితి
» పట్టించుకోని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు
» ప్రజా ఆరోగ్య కేంద్రం వద్ద వెలగని హైమాస్టు లైట్లు

పెదవాల్తేరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో గల చేపల మార్కెట్‌లో పరిసరాలు అధ్వానగా ఉన్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు వినియోగానికి ఏ మాత్రం అనువుగా లేవు. ఎన్నో రోజుల నుంచి శుభ్రం చేయకపోవడంతో మరుగుదొడ్లలో అరిశుభ్రత నెలకొంది దీనివల్ల చేపల మార్కుట్ వచ్చే కొనుగోలుదారులు , పరిసర ప్రాంతాల వారు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. పరిసరాలు బాగా లేకపోవడంతో విపరీతంగా దోమలు, ఈగల బెడద ఉందని అంటున్నారు. వీటి వల్ల ఏ వ్యాధులు సంక్రమిస్తాయోనని భయంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చేపల మార్కెట్‌లోని మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అలాగే.. పెదజాలారిపేట చేపల మార్కెట్ ప్రజా ఆరోగ్య కేంద్రం (గీతం ఆస్పత్రి) వద్ద హైమాస్ట్ లైట్స్ కొద్ది నెలల నుంచి వెలగడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సాయంత్రం కాగానే ఆ ప్రాంతంలో చీకట్లు ముసురు కొంటున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండడంతో మందుబాబులు, ఆకతాయిలు చీకటి పడుతూనే ఇక్కడకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఆ సమయంలో ఇటు వైపు నుంచి రాకపోకలు సాగించాలంటేనే భయం వేస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీసు అధికారులు కూడా ఇటు పక్క దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



వినియోగానికి ఏ మాత్రం అనువుగా లేని దుస్థితిలో మరుగుదొడ్లు

చందనోత్సవ ఘటనలో బాధితులకు చెక్‌ల అందజేత

» మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం





బాధిత కుటుంబాలకు చెక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, జేసీ మయూర్ అశోక్

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : చందనోత్సవం రోజు సింహగిరిపై గోడ కూలిన దుర్ఘటనలో అకాల మరణం చెందిన 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని ఉమానగర్‌కు చెందిన పైలా వెంకటరత్నం, ఆమె ఆడపడుచు గుజ్జరి మహాలక్ష్మిల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించినట్టుగా రూ.25 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆర్డీవో కె.సంగీత్, తహసీల్దార్ రమేష్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చెక్‌లు వెంటనే అందజేసిందన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా త్వరలోనే వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నాలుగు రోజుల్లోనే పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్‌కు మృతుల కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, నారు గోపి, పల్లా ఉమారాణి, చెల్లుబోయిన గోవింద్, సంపంగి సురేష్, కర్రి రవి, పెంటకోట ప్రకాష్, రోమాల సత్యనారాయణ, పార్వతి, సోని అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : సింహాచలం చందనోత్సవంలో గాయపడిన ప్రవీణ్‌కుమార్‌కు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి, జేసీ మయూర్ అశోక్ ఆదివారం రూ.3 లక్షల చెక్‌ను అందించారు. ఆదివారం బాలాజీనగర్‌లో బాధితుడు ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లి అయన ఆరోగ్యంపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.3 లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో చినగదిలి మండల తహసీల్దార్ పాల్ కిరణ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, బీజేపీ నాయకుడు సన్యాసిరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

భగీరథ ప్రయత్నంతో విజయం తథ్యం

» రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత
» దుర్గానగర్‌లో భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత

కూర్మన్నపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): భగీరథ ప్రయత్నంతో ఏ కార్యాన్ని చేపట్టినా.. విజయం తథ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. జీవీఎంసీ 71వ వార్డు దుర్గానగర్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఎంతో శ్రమించి, కఠోర దీక్షతో దివి నుంచి భువికి, అక్కడ నుంచి పాతాళలోకానికి ఆకాశ గంగను తీసుకువచ్చిన ఘనత భగీరథ మహర్షిదన్నారు. ఇక్ష్వాకు వంశానికి చెందిన సగర చక్రవర్తి మనుమడు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలన్నారు. భగీరథ మహర్షి సగర కులంలో జన్మించడం ఆ కులానికే వన్నె తెచ్చిందన్నారు. అతని జయంతిని అధికారకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 లోనే జీవో తీసుకు వచ్చారని గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఇస్తుంద న్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 139 కులాల అభ్యున్నతి కోసం రూ. రెండు వేల కోట్ల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం అధికారకంగా మొదటిసారి గాజువాక నియోజకవర్గంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు, విగ్రహ ఆవిష్కరణ నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యన్నారాయణ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏ. మల్లికార్జున్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, రాష్ట్ర చేనేత కులాల అధ్యక్షుడు పప్పు రాజారావు, కార్పొరేటర్లు రాజాన రామారావు, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండా జగన్, మొల్లి ముత్యాలు, నల్లూరు సూర్యనారాయణ, పప్పు శంకరరావు, కరణం కనకారావు నగర, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

» 50 చోట్ల 28 క్రీడాంశాలలో శిక్షణ

విశాఖపట్నం క్రీడలు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) నిర్వహించనున్న వార్షిక వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) జూన్ గ్యాలియట్ తెలిపారు. ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా సంఘాల సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న శిబిరాలు ఈ నెల 31 వరకు జరుగుతాయన్నారు.

జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో 28 క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో క్రీడాంశానికి సంబంధించి నిపుణులైన కోచ్‌లు, సీనియర్, వెటరన్ క్రీడాకారులు, పీఈటీలు శిక్షణ ఇస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిబిరాలలో మెలకువలు తెలుసుకుని ప్రతిభ కనబరిచిన చిన్నారులను గుర్తిస్తారు. వారికి ప్రత్యేకంగా ఏడాది పొడుగునా ఉచితం గా శిక్షణ ఇస్తారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలనే ఉద్దేశంతో కొన్ని శిక్షణ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్, బాక్సింగ్, ఖోఖో, తైక్వాండో, జూడో, హ్యాండ్‌బాల్ క్రీడాంశాలకు రెండు కేంద్రాలు; బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడలకు నాలుగు; బాస్కెట్‌బాల్‌కు మూడు; ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాలకు ఐదు; హాకీకి మూడు కేంద్రాలు కేటాయించారు. చెస్, సైక్లింగ్, ఫెన్సింగ్, కరాటే, కయాకింగ్, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, యాచింగ్, వెయిట్ లిఫ్టింగ్, వుషు క్రీడాంశాలకు ఒక్కొక్క కేంద్రం కేటాయించినట్లు తెలిపారు.

జూకు రూ.3,37,600 ఆదాయం

ఆరిలోవ, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 3 వేల 982 మంది సందర్శకులు జూ పార్కును సందర్శించినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

సందర్శకుల నుంచి సుమారు 3 లక్షల 37 వేల 600 రూపాయలు సమకూరినట్టు ఆమె తెలిపారు.

యువత శారీరక సామర్థ్యంపై దృష్టి సారించాలి

» ఏయూ వీసీ రాజశేఖర్



ఫిట్ ఇండియాలో భాగంగా నిర్వహించిన సైక్లింగ్‌లో పాల్గొన్న వీసీ

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామాన్ని జీవితంలో యువతరం తమ జీవతంలో అంతర్భాగంగా చేసుకోవాలని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఏయూ పరిపాలన భవనం వద్ద యూజీసీ ఆదేశాలతో ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మిషన్‌లో భాగంగా యూజీసీ యువతలో శారీరక వ్యాయామం, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యూజీసీ అందిస్తున్న సూచనలను స్వీకరిస్తూ ఏయూలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 'ఫిట్నెస్ కా డోస్-ఆదాగంట రోజ్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్టు చెప్పారు. వివిధ పోటీ పరీక్షలతో తలమునకలై ఉండే యువత నిత్యం తమ సమయాన్ని శారీరక వ్యాయామానికి సైతం కేటాయించాలని సూచించారు. తద్వారా వారికి మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడం, శారీరక, మానసిక ఆరోగ్య పటిష్టం అవుతుందన్నారు. ప్రస్తుతం పౌరులు ఒత్తిడితో కూడిన జీవనాన్ని సాగిస్తున్నారని, దీని నుంచి బయటపడడానికి వ్యాయామం ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఏయూ క్రీడా విభాగం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోమన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ యువతతో పాటుఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు నగరానికి చెందిన క్రీడాకారులు, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఏయూ పరిపాలన భవనం నుంచి ప్రారంభమైన ఈ సైక్లింగ్ కార్యక్రమం సిరిపురం కూడలి మీదుగా ఏయూ పరిపాలన భవనం వరకు సాగింది.

శ్రీకాంత్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శిలాఫలకం ఆవిష్కరణ

ఆరిలోవ, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు పరిధికి చెందిన శ్రీకాంత్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శిలా ఫలకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కాలనీకి అప్పటి జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ పేరిట ఈ కాలనీ వాసులు శ్రీకాంత్ నగర్‌గా నామకరణం చేశారు. మొత్తం శ్రీకాంత్ నగర్‌లో 18 వీధులు ఉన్నాయి. బీఆర్టీఎస్ రోడ్లు వేసినప్పుడు ఇల్లు కోల్పోయిన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చారని వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. ఈ కాలనీలో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, కార్యదర్శి యలమల సురేష్, నేతలు తురకపుడి బాలస్వామి, మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

వాంబే గృహం గోడ తొలగింపుపై నిరసన



గోడ తొలగించిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న బాధితులు

మద్దిలపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలోని వాంబే గృహం గోడను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలిగించడంపై రజక సేవా సంఘం సభ్యులు ఆదివారం నిరసన తెలిపారు. పద్నాలుగు ఏళ్ల కిందట ప్రభుత్వం రజకులకు వాంబే గృహాలు కేటాయించిందని, అప్పటి నుంచి ఉన్న గోడపై ఇప్పుడు టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి వచ్చిన అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన పార్టీపై ఉన్న అభిమానంతో పీతల మూర్తి ఎవరో తెలియకపోయినా అతడిని గెలిపించడానికి పని చేశామన్నారు. ఆయనే సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి జ్యోతితో గోడ కూలగొట్టించారని ఆరోపించారు. మూర్తి యాదవ్ గెలుపు కోసం మేము పనిచేస్తే మా పైనే కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, 22వ వార్డులో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా నిర్మాణాల జోలికి వెళ్లని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వాంబే వాసులు ఏర్పాటు చేసుకున్న చిన్న గోడపై ప్రతాపం చూపించడం అన్యాయం అన్నారు. నాలుగు అడుగులు లేని ప్రహరీని తొలిగించేందుకు ఏకంగా ఎక్స్‌కవేటర్‌నే తీసుకొచ్చి నివాసులను భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. గోడను తొలగించడమే కాకుండా బాల్కనీని కింద చేసిన నిర్మాణం మీరు తొలగించాలని లేదంటే సోమవారం ఇంటినే కూల్చేస్తామని హెచ్చరించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే వాంబే గృహ సముదాయానికి ఆనుకుని అపార్ట్‌మెంట్లు ఉన్నాయని, అవీ వాంబే గృహాల కంటే దారుణంగా రోడ్డు మీదకు ఉన్నా అధికారులకు కనిపించక పోవడం దారుణమన్నారు. వాటి జోలికి మాత్రం వెళ్లకుండా తమ వంటి పేదలు ఉండే ప్రభుత్వ గృహాలపై చర్యలు తీసుకోవడం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తగదని పేర్కొంటున్నారు.

శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఉద్యోగుల సహకారం కీలకం

» ఏయూ వీసీ రాజశేఖర్
» ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ సిబ్బంది సేవలు ఎంతో కీలకంగా నిలుస్తాయని వీసీ జీపీ రాజశేఖర్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ పరిపాలన భవన సిబ్బంది పాల్గొని నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. జిమ్నాసియం మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూ ఉద్యోగులు ప్రతి వారం ఇటువంటి క్రీడా, వ్యాయామ సంబంధ కార్యక్రమాల్లో భాగం కావాలని సూచించారు. తద్వారా వారి ఆరోగ్యం మెరుగవుతుందని, సమర్థవంతమైన సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు. ఉద్యోగులంతా తమకు నచ్చిన క్రీడాంశంలో రాణించాలని, శారీరక వ్యాయామాన్ని నిత్య జీవితంలో అంతర్భాగంగా మార్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. క్రీడా విభాగం సంచాలకుడు ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, ఆచార్యులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేస్తూ శతాబ్ది ఉత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తారన్నారు. శారీరక ఆరోగ్యం, వ్యాయామం పట్ల ఉద్యోగులు అవగాహన పెంచుకుంటున్నారని నిత్యం తమ క్రీడా మైదానాల్లో ఏయూ ఉద్యోగులు కనిపిస్తారన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఏయూ పరిపాలన భవనంలో పని చేస్తున్న సిబ్బంది ఆరు జట్లుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, డీసీఎంఎస్ విభాగాధిపతి జాలాది రవి, ఫైనాన్స్ అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఏయూ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తీర భద్రత పోలీసుల ఆధ్వర్యంలో మత్స్యకారులకు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో నిర్వహిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామల వారికి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి సహకారంతో జాలారి ఎండాడ, వాసవానిపాలెం మత్స్యకారులు సుమారు రెండు వందల మందికి వివిధ వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కోస్టల్ సెక్యూరిటీ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపినాథ్ జెట్టి ఆదేశాలమేరకు నిర్వహించిన శిబిరంలో అదనపు ఎస్పీ జి.మధుసూదనరావు, నార్త్ సబ్ డివిజనల్ అధికారి బి.నాగేశ్వరరావు, పోర్టు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు రైతుబజార్‌లో ఆటో డ్రైవర్ల మధ్య కొట్లాట

» సరకు అన్‌లోడ్ విషయంలో వివాదం
» ఓ ఆటో డ్రైవర్‌పై దాడి
» పోలీసులకు ఇరు వర్గాల ఫిర్యాదు



రైతుబజార్‌లో ఆటోడ్రైవర్ల వాగ్వాదం



గాయపడిన ఆటోడ్రైవర్ పైడిరాజు

పెదవాల్తేరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెదవాల్తేరు రైతుబజారుకు పండ్లను తీసుకొచ్చిన ఆటో డ్రైవరు, కూరగాయలు తీసుకొచ్చిన ఆటో డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అనందపురం ప్రాంతానికి చెందిన కొందరు రైతులు ఆదివారం ఉదయం ఒక ఆటోలో రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చారు. అలాగే పూర్ణా మార్కెట్ నుంచి పండ్ల వ్యాపారులు పండ్లను మరో ఆటోలో తీసుకొచ్చారు. అయితే అక్కడి నిబంధనలకు విరుద్ధంగా ముందు వచ్చిన ఆటోలో సరుకును కాకుండా తర్వాత వచ్చిన ఆటోలో సరుకును కలాసీలు దించడంతో వివాదం మొదలైంది. సరుకు దించే విషయంలో ఇద్దరు ఆటో డ్రైవర్లు కలహించుకున్నారు. ఈ క్రమంలో పూర్ణా మార్కెట్ నుంచి పండ్లు తీసుకొని వచ్చిన ఆటో డ్రైవర్ కొంతమంది తన స్నేహితులను తీసుకొచ్చి ఆనందపురం నుంచి కూరగాయలు తెచ్చిన ఆటోడ్రైవర్ పైడిరాజుపై దాడి చేయించాడు. ఈ దాడితో పైడిరాజు గాయపడ్డాడు. దీనిపై పైడిరాజు మూడో పట్టన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే పూర్ణా మార్కెట్ నుంచి పండ్లు తెచ్చిన ఆటో డ్రైవర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని, విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని త్రీ టౌన్ పోలీసుస్టేషన్ సీఐ పైడయ్య తెలిపారు. కాగా రైతు బజార్‌లో ఇంత వివాదం జరుగుతున్నా ఎస్టేట్ అధికారి సత్యకళ స్పందించడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనకేమీ సంబంధం లేనట్టుగా ఆమె వ్యవహరించారంటూ బజార్‌లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలోనే జోక్యం కల్పించుకొని ఉంటే ఈ వివాదం జరిగేది కాదని, ఆమె బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని మండిపడుతున్నారు.

'20న జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి'

మహారాణిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని విశాఖ పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘాలు కోరాయి. ఆదివారం సీఐటీయూ భవన్‌లో విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమ్మె హక్కును నిర్వీర్యం చేసే లేబర్ కోడ్స్ ప్రమాదకరమైనవని అన్నారు. ఇవి అమలైతే సమ్మె చేయడం చట్టవ్యతిరేక చర్య అవుతుందని తెలిపారు. చట్టాలు మార్చాలంటే పార్లమెంట్‌లో చేయాలి. కానీ రాష్ట్రాలకు ఇష్టం ఉంటే మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. లేబర్ కోడ్‌లు వస్తే ఇప్పుడు ఉన్న కార్మిక చట్టాలు అన్నీ పోయినట్లేనని తెలిపారు. ఈ సమావేశంలో విశాఖ పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ డి.వి.రమణ

సీతమ్మధార/మహారాణిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు రౌడీషీటర్లను హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఆదివారం వారిని పిలిపించి దినచర్యపై ఆరా తీశారు. ప్రజలకు అశాంతి కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పి.డి. చట్టం అమలు చేస్తామని హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లోనూ ఇన్‌స్పెక్టర్ డి.వి.రమణ కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, క్రమశిక్షణ తప్పి మళ్లీ అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మీ కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందని, మంచిగా ప్రవర్తిస్తే రౌడీషీట్లను మూసి వేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. నేర జీవితాన్ని వదిలేసి కుటుంబంతో మంచి నడవడికతో ఉంటే పోలీస్ శాఖ సహకరిస్తుందని అన్నారు.

మేడే సాంస్కృతిక ఉత్సవాలు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): మేడే సాంస్కృతిక ఉత్సవాలు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఎం.భాస్కరరావు హాజరై మాట్లాడారు. కళల్లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించాలన్నారు. ఏవీకే ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యం, లఘునాటికలు, మేడే పాటపై నృత్య రూపకం, కోలాటం, సినీ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రమణ, గ్రంథాలయ సేవా సంస్థల అధ్యక్షుడు బీఎల్ నారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలు ప్రదానం చేశారు.

మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ మహిళను వినయ్ అనే వ్యక్తి నమ్మించి మోసగించాడని సీఐ సత్యనారాయణ తెలిపారు. వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి డార్మెటరీకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. కంచరపాలెం కొత్తూరులో ఉంటున్న ఆ మహిళకు 2015లో వివాహంకాగా, కొద్ది కాలం తర్వాత పెద్దల సమక్షంలో ఆ దంపతులు విడిపోయారన్నారు.

గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.14,500 విలువైన 2 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు కేటీఆర్.లక్ష్మి, మిస్త్రీ తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన శరత్‌కుమార్ (22) అనే నిందితుడు తిరుపూర్‌కు గంజాయి రవాణా చేస్తూ దొరికాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నలుగురు భోపాల్‌వాసుల అరెస్ట్

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు నాల్గో పట్టణ పోలీస్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో భోపాల్‌కు చెందిన నలుగురు 14 కిలోల గంజాయిని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే సారూ.. సమస్యలు పరిష్కరించరూ!



స్థానికులతో మాట్లాడుతున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ పరిధి 50వ వార్డు వంశీనగర్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఆదివారం పర్యటించి స్థానికుల ఇబ్బందుల్ని తెలుసుకున్నారు. వంశీనగర్ మీదుగా పారుతున్న గెడ్డ తరుచూ పొంగిపొర్లుతూ నివాసిత ప్రాంతాల వారికి చుక్కలు చూపిస్తోంది. రెండేళ్ల కిందట కూడా ఒక్క రోజు కురిసిన భారీ వర్షం ప్రభావంతో గెడ్డ పక్కగా పార్క్ చేసిన కార్లు కొట్టుకుపోయాయి. స్థానికులకు సెల్లార్ పార్కింగ్ లేని పాత ఇళ్ల యజమానుల వాహనాలు సాధారణంగా గెడ్డ పక్కగా రోడ్డుపైనే నిలుపుతారు.. అయితే వంశీనగర్‌లో పార్క్ చేసే వాహనాలకే కాదు.. ఆటలాడే చిన్నారులకు, వాహనదారులకు, నివాసితులకు భద్రత లేని పరిస్థితి నెలకొంది. మాధవధార ఎగువ ప్రాంతాల నుంచి పారుతున్న గెడ్డ ఇక్కడ హైవే పక్కన జామ్ అయిపోతుంది. ఇటీవల చేపట్టిన పునర్నిర్మాణ పనుల్లో గెడ్డ బేస్‌మెంట్ ఎత్తు చేయడం కారణంగానే దిగువ పైపులైన్లకు అనుసంధానం మూసుకుపోయి, చెత్త చెదారాలు, మురుగు నీరు నేరుగా నివాసిత కాలనీని, హైవే రోడ్డును ముంచెత్తుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గెడ్డను పరిశీలించిన ఆయన ఈ సమస్యపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, స్థానికులతో ఓ కీలక సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పర్యటనలో వంశీనగర్ నివాసిత సంఘం సభ్యులు ధనుంజయ్, అచ్చిబాబు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'దాసరి, మానికొండల మధ్య సారూప్యత'



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబీ వర్ధన్, చిత్రంలో రమణమూర్తి, మిర్యాల వెంకటరావు తదితరులు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు దాసరి నారాయణరావు, సుప్రసిద్ధ పాత్రికేయుడు మానికొండ చలపతిరావుల మధ్య సామాజికంగా ఒకే సారూప్యత ఉందని ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి బాబీ వర్ధన్ అన్నారు. ఆదివారం పౌరగ్రంథాలయంలో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో దాసరి జయంతి వేడుకలు, మానికొండ చలపతిరావు పుస్తక పరిచయ సభ జరిగింది. కుల వివక్షపై దాసరి రచించిన 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలోని 'చౌదరి గారు..రాయుడు గారు' పాటతో సభాకార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాబీ వర్ధన్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛ మనిషి ప్రాణం వంటిదని అప్పటి ప్రధాని నెహ్రూ భావించి నేషనల్ హెరాల్డ్ పత్రికను చలపతిరావుకు అప్పగించారన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో నేషనల్ హెరాల్డ్ అగ్రస్థానంలో ఉండేదన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చలపతిరావు ఆ పత్రికలో అక్షరాలు సంధించారని గుర్తు చేశారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో నెహ్రూ గోడ దూకుతున్నట్లు ప్రచురించడంతో అప్పట్లో అది వివాదాస్పదమైందని చెప్పారు. గోడ దూకితే అలా ఉంటానా? అని నెహ్రూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు. పత్రికలో ఎప్పుడు ఉంటామో, లేదో అని చలపతిరావు రాజీనామా పత్రాన్ని జేబులో పెట్టుకుని పని చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల వెంకటరావు, కటారి అప్పారావు, సాగర్‌కుమార్, రామకృష్ణారావు, వీవీ రమణమూర్తి, కె.రమణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి, పిలానిల తిలక్ పాల్గొన్నారు.

రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా నీట్



కెమికల్ కళాశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



తాటిచెట్లపాలెంలో పరీక్ష కేంద్రం ఎదుట తల్లిదండ్రులతో విద్యార్థులు

కంచరపాలెం/అక్కయ్యపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం (వాల్తేరు)లో ఆదివారం నీట్ ప్రశాంతంగా జరిగింది. నిబంధనల ప్రకారం విద్యార్థులు ఉదయం 11 గంటల సమయానికే కేంద్రాలకు చేరుకున్నారు. విస్తృత తనిఖీల అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్, ప్లాంక్, ఫోల్డర్, చెవి రింగులు తదితర వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. కంచరపాలెం కేంద్రానికి 480 మంది విద్యార్థులను కేటాయించగా వారిలో 471 మంది హాజరయ్యారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. తమ పిల్లలు పరీక్ష గదుల్లో రాస్తుంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు తల్లిదండ్రులు ఆత్రుతగా ఎదురుచూశారు. కేంద్రాన్ని పర్యవేక్షించిన వారిలో డిప్యూటీ సూపరింటెండెంట్ దామోదర్, ఇతర అధికారులు ఉన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగ్రదాడి హేయమైన చర్య



ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పిస్తున్న కళాకారులు

సీతమ్మధార, మే 4 (ఆంధ్రజ్యోతి): ముష్కరులు అమాయక పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్యగా పలువురు వక్తలు ఖండించారు. భారత శక్తిని నేరుగా ఎదుర్కోలేని పాకిస్థానీయులు చేస్తున్న ఇటువంటి చర్యలను ప్రపంచంలో ఎవరూ కూడా సమర్థించరన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు, సింహాచలం కొండపై గోడ కూలి మృతి చెందిన ఏడుగురికి విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆదివారం సింధూర ఫంక్షన్ హాల్లో నివాళులర్పించింది. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉగ్రదాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. పర్యాటకులు, సామాన్య ప్రజలపై ఉగ్రవాదులు దాడులు చేయడం బాధాకరమన్నారు. మానవత్వంగల ఏ ఒక్కరూ ఇటువంటి చర్యలను సమర్థించరన్నారు. తీవ్రవాదాన్ని అణిచి వేయడానికి ప్రపంచంలోని అత్యధిక దేశాలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు, గాయకుడు కె.జనార్దన్, వర్రె నాంచారయ్య, యాద్‌కుమార్, మనోహర్ ప్రసాద్, ధనుంజయ్, రాథో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని మృతికి సంతాపం



న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న మాటూరి గిరిజ ప్రియదర్శిని ఆదివారం హైదరాబాద్‌లో అకాల మరణం చెందడం విచారకరమని ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్ అన్నారు. ఆమె వివిధ కోర్టుల్లో జిల్లా జడ్జిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ టీవీకే చాంబర్స్‌లో ఆమె సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలలో హైకోర్టులో రాజ్యాంగబద్ధంగా తీర్పులను ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఆమె మరింత అత్యున్నత స్థానానికి ఎదుగుతారని ఆశించామని, కానీ ఆమె అకాల మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వాగుపల్లి చిన్నారావు, డా.టి.బోసుబాబు, పాకా సత్యనారాయణ, లాయర్స్ ఫోరం ఫర్ జస్టిస్ గుడివల్లి సుబ్బారావు, నిమ్మకాయల ఈశ్వరరావు, సి.రవి, పడమట సురేష్, కోమల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ్వుల దినోత్సవం



జడ్జిమెంట్ ప్లీజ్ స్కిట్ ప్రదర్శనలో హాస్యకళాకారులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ (విశాఖపట్నం), లాఫర్స్ ఫన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం, విశాఖ పౌరగ్రంథాలయంలో నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ స్కిట్స్‌తో ఆద్యంతం నవ్వులు పూయించారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, గణేష్, కుమారి, షపుమినాయుడు, గోపికృష్ణ, జీవీ లక్ష్మీనరసింగరావు, నిరోషాలు లఘు నాటికలు ప్రదర్శించారు...జడ్జిమెంట్ ప్లీజ్...హింస...ఛానల్ ఓపెన్ అయింది..సూర్య నమస్కారాలు తదితర స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పూయించాయి. ముందుగా అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, పింకీ శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. తదుపరి అతిథుల చేతులమీదుగా మెమెంటోలు అందజేశారు. నవ్వుల ప్రియులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విశాఖపట్నం క్రీడలు, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) నిర్వహించనున్న వార్షిక వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) జూన్ గ్యాలియట్ తెలిపారు. ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా సంఘాల సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న శిబిరాలు ఈ నెల 31 వరకు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో 28 క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో క్రీడాంశానికి సంబంధించి నిపుణులైన కోచ్‌లు, సీనియర్, వెటరన్ క్రీడాకారులు, పీఈటీలు శిక్షణ ఇస్తారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శిబిరాలలో మెలకువలు తెలుసుకుని ప్రతిభ కనబరిచిన చిన్నారులను గుర్తించి ఏడాది పొడుగునా ఉచితంగా శిక్షణ ఇస్తారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించాలనే ఉద్దేశంతో కొన్ని శిక్షణ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. క్రీడాంశాల వారీగా శిక్షణ కేంద్రాల వివరాలు తెలియజేశారు.

శిక్షణ తరగతులకు ఎన్‌సీసీ క్యాడెట్లు



శిక్షణ తరగతులకు వెళ్లిన ఎన్‌సీసీ క్యాడెట్లు

అక్కయ్యపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 23 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఆదివారం విజయనగరం సమీపంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులకు వెళ్లారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ అజయ్‌కుమార్ నేతృత్వంలో పది రోజులు జరగనున్న శిక్షణ తరగతుల్లో ఎల్‌బీ కాలేజీ ఎన్‌సీసీ అధికారి బ్రహ్మానందరెడ్డి, సుబేదార్ మేజర్ జయప్రకాశ్, హవల్దార్ శ్యామలరావు పాల్గొన్నారన్నారు. ఈ తరగతుల్లో వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్ డ్రిల్, మిలిటరీ హిస్టరీ, హెల్త్, హైజీన్ వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి ప్రత్యక్షంగా 22 డీలక్స్ రైఫిల్‌తో ఫైరింగ్ ఉంటుందని, ఇందులో ప్రతిభావంతులకు ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం రోజున క్యాంప్‌నకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లను హెచ్ఎం బి.లక్ష్మీనరస అభినందించారు.

'మా ఆధీనంలో భూములపై హక్కులు వారివా'?



ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్వరమెట్ట అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 33వ వార్డులోని వెంకటేశ్వరమెట్టపై 1450, 1261 సర్వే నెంబర్లతో ఉన్న భూముల ఆధారంగా సుమారు వందేళ్లుగా జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ఆ స్థలాలు తమవంటూ దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఒత్తిళ్లు రావడంతో చాలా ఆందోళన చెందుతున్నామని వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమలాదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దీనిపై స్పందిస్తూ ఈ సమస్యపై రెండుసార్లు అంసెబ్లీలో మాట్లాడానని, దేవదాయ మంత్రితో కూడా చర్చించామన్నారు. ఈ సమస్య ఆరునెలల్లో పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు భీశెట్టి శ్రీనివాస్, శరగడం పెద్ద, యల్లపు గోపాలరావు, కోరుబిల్లి ఆది, శ్యాము, గోవిందరావు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఇకపై కూల్..కూల్‌గా ట్రాఫిక్ విధులు



డాబాగార్డెన్స్ సర్కిల్‌లో చల్లదనాన్ని అందించే జాకెట్లు ధరించి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

డాబాగార్డెన్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు భానుడు రోజురోజుకు భగభగమండుతున్న నేపథ్యంలో కాసేపు ఎండలోకి వెళ్లాలంటేనే ప్రజలు జడిసిపోతుంటారు. అలాంటిది ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా ఎండవేడిమిని తట్టుకుంటూ .తీవ్ర ఉక్కపోతను భరిస్తూనే ట్రాఫిక్ పోలీసులు నడిరోడ్లపై విధులు నిర్వహిస్తుంటారు. ఎండ వేడిమి తట్టుకోలేక తీవ్ర అలసట చెందుతుంటారు. వీరి అవస్థలను గమనించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హరియాణా రాష్ట్రం గుర్‌గావ్ నుంచి కూల్ జాకెట్లను తెప్పించారు. ఇందులో భాగంగా ఆదివారం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను సారథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి జాకెట్లు ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు వీటిని ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు అందజేశామన్నారు. ఎండ నుంచి ఉపశమనంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు రక్షణగా కూడా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. జాకెట్ లోపల్ థర్మాకూల్ ఉండటంతో మూడు గంటల పాటు చల్లదనం నిలిచి ఉంటుంది.

కాకి లెక్కలు

... 5వ పేజీ తరువాయి

టికెట్లను వందల సంఖ్యలోనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించి మిగిలినవన్నీ బ్లాక్ చేశారు. గత ఏడాది కూడా ఓ ఏఈఓ రూ.వెయ్యి టికెట్లు బ్యాంకులో బ్లాక్ చేశారని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి నాటి కలెక్టర్ మల్లికార్జునకు విలేకరుల సమావేశంలో వివరించగా, విచారణ చేయిస్తామని చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ టికెట్లను బ్లాక్ చేసి అవసరమైన వారికి ఇచ్చుకోవడంలో కమిషనర్ నుంచి ఈవో వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉందని సమాచారం.

ప్రజా ప్రతినిధులకూ చుక్కలే...

కాగా ఈ ఏడాది చందనోత్సవం ముందు రోజు మంగళవారం సాయంత్రం వరకు ప్రజా ప్రతినిధులకు టికెట్లు ఇవ్వలేదు. వారు కోరినన్ని ఇవ్వలేదు సరికదా, అదనంగా అడిగితే ఆ రోజు రాత్రి 11 గంటల వరకు ఈఓ తన కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. డబ్బులు చెల్లించి కొనుక్కునే టికెట్లు ఆన్‌లైన్‌లో, బ్యాంకులో అందుబాటులో ఉంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్ల పీఏలు అక్కడ కాకుండా కలెక్టరేట్, ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఏటా టికెట్లను బ్లాక్ చేసి ఆలయ అధికారులే బ్లాకులో అమ్ముకుంటున్నారు. ఇది వాస్తవం. పత్రికల్లో కథనాలు అవాస్తవమని నిరూపించదలుచుకుంటే మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు ఈఓ కార్యాలయం బయట ఏమి జరిగిందో సీసీ టీవీ ఫుటేజీ బయటపెట్టాలి.

ఇవీ వాస్తవాలు

దేవస్థానానికి భారీ విరాళాలు ఇచ్చేవారికి ఏటా టికెట్లు ఇచ్చేవారు. ఈ సారి ఇవ్వలేదు.గత ఏడాది జీవీఎంసీ కార్పొరేటర్లు ఒక్కొక్కరికి ఐదేసి టికెట్లు ఇచ్చారు. ఈసారి కేవలం రెండు మాత్రమే ఇచ్చారు. ప్రజాప్రతినిధులు కోరినన్ని ఇవ్వలేదు. అందరికీ సమానంగానూ అందించలేదు. విశాఖలో కీలకమైన ఓ ప్రజాప్రతినిధి 80 టికెట్లు అడిగితే 50 మాత్రమే అదీ మంగళవారం మధ్యాహ్నం ఇచ్చారు. మరో 30 కావాలంటే కలెక్టరేట్‌కు, ఈఓ కార్యాలయానికి రాత్రి 11 గంటల వరకు తిప్పించుకొని అప్పుడు ఇచ్చారు. ఓ కార్పొరేషన్ చైర్మన్‌కు కూడా ఇదే అనుభవం ఎదురయింది. దీంతో తాజాగా ఈఓ విడుదల చేసిన ప్రకటన అంతా బూటకమని పీఏలు ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఫోన్‌లో తెలిపారు.

టికెట్లు కావాలని లెటర్ హెడ్‌లపై దరఖాస్తు చేసిన వారందరికీ మంగళవారం సాయంత్రం నుంచి జారీ ప్రారంభించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సులువుగా లభిస్తే వీరంతా ఈఓ కార్యాలయం చుట్టూ ఎందుకు తిరగాల్సి వచ్చిందో ఈఓ చెప్పలేదు. ఈ నేపథ్యంలో తప్పులు చేయడం, సమర్థించుకోవడం సింహాచలం దేవస్థానం అధికారులకు అలవాటుగా మారందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తీరు గమనించిన త్రిసభ్య కమిటీ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

'పది' గట్టెక్కించేలా!

... 5వ పేజీ తరువాయి

తరగతులు నిర్వహించడం కష్టమైన పని కావడంతో ప్రధాన కూడళ్లలో ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ పాఠశాలకు సమీపంలో మూడు, నాలుగు పాఠశాలల ఉపాధ్యాయులకు విధులు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు మూడు సబ్జెక్టులపై బోధించి, సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో అధికంగా 200 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలతోపాటు సమీపంలో మరో రెండుమూడు పాఠశాలల విద్యార్థులకు కలిపి తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. ఈవారం నుంచి హాజరు సంఖ్య పెరిగేలా చూడాలని హెచ్ఎంలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. ప్రతి రోజు ఒకటిలేదా రెండు ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీచేస్తున్నారు. పరీక్షలకు వీలుగా విద్యార్థులను సన్నద్ధంచేయాలని, సందేహాలుంటే నివృత్తిచేయాలని టీచర్లకు సూచించారు. కాగా ఈనెల 19వతేదీ నుంచి 12 కేంద్రాల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈవో తెలిపారు.

హౌసింగ్‌లో ముదుర్లు

... 5వ పేజీ తరువాయి

మరో ఏఈ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని, లేని అధికారాలతో నగర శివారు సెంటు స్థలాల్లో ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని కార్పొరేషన్‌లో పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పనులుచేసిన మేరకు బిల్లులు రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో తాము సూచించిన కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత ఇవ్వాలని సచివాలయాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు. లేఅవుట్‌లలో కొందరు కాంట్రాక్టర్లను పనుల నుంచి తప్పించి, కొత్తవారికి అప్పగించడంలో వీరిద్దరూ ప్రధాన పాత్రపోషించారని సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్లను పట్టించుకోరని, గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి ప్రజాప్రతినిధులకు దగ్గరి వారమంటూ భారీగా ముడుపులు మూటగట్టారని తెలిసింది. ఏఈల దందాపై ఉన్నతాధికారులు దృష్టిసారించి అడ్డుకట్ట వేయాలని ఇళ్ల లబ్ధిదారులతో పాటు నగర వాసులు కోరుతున్నారు.

భగీరథ ప్రయత్నంతో విజయం తథ్యం

» రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవిత

» దుర్గానగర్‌లో భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ





బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత. (ఇన్‌సెట్‌లో) శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి సవిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

శ్రీనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : భగీరథ ప్రయత్నంతో ఏ కార్యాన్ని చేపట్టినా.. విజయం తథ్య మని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత అన్నారు. జీవీఎంసీ 71 వార్డు దుర్గానగర్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివా రం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఎంతో శ్రమించి, కఠోర దీక్షతో దివి నుంచి భువికి, అక్కడ నుంచి పాతాళలోకానికి ఆకాశగంగను తీసుకువచ్చిన ఘనత భగీరథ మహర్షిదన్నారు. ఇక్ష్వాకు వంశానికి చెందిన సగర చక్రవర్తి మనుమడు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలన్నారు. భగీరథ మహర్షి సగర కులంలో జన్మించడం ఆ కులానికే వన్నె తెచ్చిందన్నారు. అతని జయంతిని అధికారకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019లోనే జీవో తీసుకువచ్చారని గుర్తు చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఇస్తుంద న్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 139 కులాల అభ్యున్నతి కోసం రూ. రెండు వేల కోట్ల రుణాలను మంజూరు చేశామని తెలిపారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం అధికారకంగా మొదటిసారి గాజువాక నియోజకవర్గంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు, విగ్రహ ఆవిష్కరణ నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యన్నారాయణ, కమిషనర్ మల్లికార్జున, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, రాష్ట్ర చేనేత కులాల అధ్యక్షుడు పప్పు రాజారావు, కార్పొరేటర్లు రాజాన రామారావు, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండా జగన్, మొల్లి ముత్యాలు, నల్లారు సూర్యనారాయణ, పప్పు శంకరరావు, కరణం కనకారావు సగర, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెపై స్టీల్‌ప్లాంట్‌లో తర్జనభర్జన

ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన ఉద్యోగ, కాంట్రాక్టు కార్మిక సంఘాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 4 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన జాతీయ కార్మిక సమ్మెలో భాగంగా స్టీల్‌ప్లాంటులో సమ్మె చేపట్టడంపై కార్మిక నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ మేరకు ఆదివారం టౌన్‌షిప్‌లో కార్మిక సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మె చేద్దామని కొన్ని కార్మిక సంఘాల నాయకులు ప్రతిపాదించగా, మరికొందరు ప్రస్తుతం సమ్మె చేయడం మంచిది కాదని, ఇప్పటికే ప్లాంటులో విభిన్న పరిస్థితులు నెలకొన్నందున సమ్మెలో పాల్గొంటే ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నారు

అయితే కొన్ని కార్మిక సంఘాలు మాత్రం సమ్మె వద్దని, జాతీయ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేవలం నిరసన తెలుపుదామని ప్రతిపాదించారు. అయితే సమ్మె చేస్తే ఉక్కు యాజమాన్యం దిగివస్తుందని, కార్మిక సమస్యలను పరిష్కరిస్తుందని.. అందువల్ల సమ్మె చేయడమే మంచిదని అతి తక్కువ మంది పేర్కొన్నట్టు తెలిసింది. అందుకు పెద్ద కార్మిక సంఘ నాయకులు మాత్రం ఒప్పుకోలేదని తెలిసింది.

ఏదిఏమైనా సమ్మె వద్దని ఎక్కువ మంది నాయకులు ప్రతిపాదించారు. అయితే దీనిపై మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని కార్మిక నాయకులు పేర్కొన్నారు. కాగా ఇప్పటికే ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు మాత్రం సమ్మె చేస్తామని ఉక్కు యాజమాన్యానికి నోటీసులు అందజేశాయి.

ములగాడ రోడ్డులో గ్యాస్ పైపు లైన్ పనులు

ప్రయాణికులకు మొదలైన కష్టాలు



భూ గర్భంలో గ్యాస్ పైపు లైన్ పనులు జరుగుతున్న దృశ్యం.. పక్కన రోడ్డును తవ్వి పక్కనే పడేసిన పలకలు

మల్కాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): ములగాడ మార్గంలో భూగర్భం నుంచి భారీ ఎత్తున గ్యాస్ పైపు లైన్ పనులు సాగుతున్నాయి. అయితే ఈ పనులు ప్రారంభం కావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాక్‌యార్డు వద్ద ఉన్న సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన పునర్నిర్మాణ పనులలో భాగంగా ఈ వంతెనను పూర్తిగా మూసేయడంతో అనేక మంది ములగాడ మీదుగా షీలానగర్ హైవేకు చేరుకొని అక్కడి నుంచి మారుతి జంక్షన్ ద్వారా కాన్వెంట్ మీదుగా నగరంలోకి వెళ్తున్నారు. అయితే ములగాడ మార్గంలో భూగర్భం నుంచి పెద్ద ఎత్తున గ్యాస్ పైపు లైన్ ఏర్పాట్లు చేస్తుండడంతో పెద్ద ఎత్తున గోతులు తవ్వడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. దీనితో దుమ్ము, ధూళి మధ్య ప్రయాణించవలసి వస్తుంది. శ్రావణ్ షిప్పింగ్ కార్పొరేషన్ వద్ద ఈ రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. ఇక్కడ వాహనాలు ఎగిరిపడి వెళ్లాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో విద్యుత్ దీపాలు కూడా ఉండవు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డులో సాఫీగా ప్రయాణాలు సాగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



సత్కార గ్రహీతలతో విద్యార్థులు, గ్రామస్థులు

ఉపాధ్యాయులకు ఘనంగా సత్కారం

పెందుర్తిరూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల అగ్రహారంలో ఆదవారం సాయంత్రం పండగ వాతావరణం నెలకొంది. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వడంతో గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. ఈ పాఠశాల నుంచి 103 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 99 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 30 మంది 500కు పైబడి మార్కులు సాధించారు. స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణితో పాటు ఉపాధ్యాయ సిబ్బందికి గ్రామస్థులు దుశ్శాలువాలు కప్పి పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపీ అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, మద్దాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా పూర్వపు హెచ్‌ఎం దివంగత ఏపీఎస్ శివాజీ వర్ధంతిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మురళీధరరెడ్డికి బెస్ట్ ప్రెసిడెంట్ లయన్స్ క్లబ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీధరరెడ్డి

కూర్మన్నపాలెం, మే 4 (ఆంధ్ర జ్యోతి): కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధరరెడ్డి బెస్ట్ ప్రెసిడెంట్ లయన్స్ క్లబ్ అవార్డు (2024-25) అందుకున్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ జిల్లా వార్షిక అవార్డు కార్యక్రమంలో కౌన్సిల్ ఛైర్మన్ లయన్ వెంకట రవీంద్రనాథ్ చేతులమీదుగా ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను ఆయన అందుకున్నారు. కూర్మన్నపాలెంలో లయన్స్ క్లబ్ తరఫున మురళీధరరెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా మురళీధరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తనకు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ మెడల్, విశాఖ లయన్స్ క్లబ్ బెస్ట్, మెంబర్‌షిప్ గ్రోత్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నానన్నారు. అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతానని పేర్కొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐలా ఛైర్మన్ రఘు, శేషగిరిరావు

ఆటోనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత నుంచి ప్రజలు, కార్మికులకు ఉపశమనం కలిగించేందుకుగాను ఏపీఐఐసీ, ఐలా, వాసీవా సిబ్బంది ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఆటోనగర్ పరిశ్రమల పరిసరాల్లోని కార్మికులకు ఉపయుక్తంగా ఉండేలా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఐలా ఛైర్మన్ రఘు, మాజీ ఛైర్మన్ శేషగిరిరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షులు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా వైస్ ఛైర్మన్ కొల్లి ఈశ్వరరావు, సెక్రటరీ చీకటి సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు, వాసీవా మాజీ అధ్యక్షులు కె.బాలాజీ,పారిశ్రామిక వేత్తలు కృష్ణ ప్రసాద్,కుమార్ రెడ్డి, కిషోర్, సత్యనారాయణ కోటేశ్వరరావు, ఒమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



కంపూరటర్లను ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): వేగం కాదు ముఖ్యం-సురక్షిత ప్రయాణమే మా లక్ష్యమంటూ ప్రయాణికులకు మెరుగైన రవాణాను అందిస్తున్న ఆర్టీసీ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో ఆదివాఆరం 63 నూతన కంప్యూటర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెస్తుందన్నారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ ఎస్.దొన్నుదొర మాట్లాడుతూ త్వరలో మరికొన్ని నూతన బస్సులు రానున్నాయన్నారు. కార్యక్రమంలో జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, స్టీల్ సిటీ డీఎం గౌతమ్ ఛటర్జీ, ఏడీఎం శ్రీనివాసరావు, గాజువాక డీఎం విప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

హద్దుమీరితే జైలుకు తరలిస్తాం..

రౌడీ షీటర్లకు పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ హెచ్చరిక



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సతీశ్‌కుమార్

పెందుర్తి, మే 4 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు హద్దుమీరి ప్రవర్తిస్తే జైలుకు తరలిస్తామని సీఐ కేవీ సతీశ్‌కుమార్ హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఆదివారం రౌడీ షీటర్లందరూ విధిగా పోలీస్ స్టేషన్‌కు హాజరవ్వాలన్నారు. పంచాయితీలు నిర్వహించడం, సెటిల్‌మెంట్లకు పాల్పడడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు చేపడతామన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో, కుటుంబంతో ఆనందంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్కాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణాపురం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. త్రినాథపురానికి చెందిన ప్రకాశ్ (35), మోహన్‌లు బైకుపై మల్కాపురం నుంచి శ్రీహరిపురం వైపు వెళ్తున్నారు. మోహన్ వాహనం నడుపుతుండగా ప్రకాశ్ వెనక కూర్చున్నాడు. ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో బైకు వెనక కూర్చున్న ప్రకాశ్ బస్సు వెనుక చక్రం కిందపడి మృతి చెందాడు. మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మల్కాపురం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రకాశ్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు, మోహన్‌ను వేరే ఆస్పత్రికి తరలించారు. మృతుడు ప్రకాశ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ ఖాతాదారులకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ యూకో బ్యాంకులో 40 ఏళ్లుగా అకౌంట్ కలిగి, ప్లాంట్ నుంచి జీతాలు పొందుతున్న 50 మంది సీనియర్ ఖాతాదారులను బ్యాంక్ ఆంధ్రా రీజియన్ ఇంటిగ్రేటెడ్ లోన్ హబ్ హెడ్ సుదీప్తి మిశ్రా ఆదివారం సత్కరించారు. ఆదివారం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఖాతాదారులుగా ఉండడం గొప్ప విషయమని, ఈ అనుబంధాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ తెలుగు రాష్ట్రాల జోనల్ మేనేజర్ ఎస్.శ్రీకాంత్, మేనేజర్ బి.సతీశ్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ రిటైర్డు అధికారులు సవ్యసాయి పాణి, సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.



అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోన తాతారావు

స్పీకర్ అయ్యన్నను కలిసిన డీసీసీబీ ఛైర్మన్

గాజువాక, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడును డీసీసీబీ ఛైర్మన్‌గా నియమితులైన కోన తాతారావు ఆదివారం నర్సీపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు సహకార చట్టాలపై అవగాహన కలిగి ఉండి. రైతులకు సేవ చేయాలన్న సంకల్పంతో ఉన్న కోన తాతారావుకు ఈ పదవి రావడం మంచి విషయమని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. రైతులకు మరింతగా సేవలందించి చేసి డీసీసీబీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

80 మంది రక్తదానం

వేపగుంట మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సింహపురికాలనీ సమీపంలోని వసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రామరాజు మాట్లాడుతూ సమాజానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో 80 మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎల్.శ్రీనివాసరావు, అజిత్, రమణయ్య,శ్రీనివాస్, హరిప్రసాద్, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గం కాలేజీ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్ మార్గంలో వెళ్తున్న కారు, అదే మార్గంలో వెళ్తున్న ద్విచక్ర వాహనం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నడుపూరు ప్రాంతానికి చెందిన కర్రి రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రుడని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర సరకులు అందజేత

కూర్మన్నపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి రజకవీధిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య చేతుల మీదుగా ఇటీవల మృతి చెందిన నిరుపేద శివ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా చింతలపూడి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి చేయూతనిచ్చేందుకు నాయకులు ముందుకు రావాలన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 34, కంద 80, గోరుచిక్కుడు 30, దేముడు చిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



అమ్మవారికి గుడ్లు సమర్పించి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా సత్తమ్మతల్లి అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత సత్తమ్మతల్లి అనుపోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గవర జగ్గయ్యపాలెం నుంచి పలువురు యువకులు సాముగారడీతో సందడి చేయగా, అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా అమ్మవారి ఘటాలను వెంకటేశ్వర కాలనీలో ఉన్న సత్తమ్మతల్లి ఆలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. వెంకటేశ్వరకాలనీ, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, గవర జగ్గయ్యపాలెం కాలనీలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపుకుంకుమలతో పాటు కోడిగుడ్లను సత్తమ్మతల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పైడితల్లమ్మ మహోత్సవాలు ప్రారంభం

నేడు తొలేళ్లు, ప్రధాన పండగ రేపు



గోపాలపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ప్రశాంతినగర్‌లో కొలువుదీరిన శ్రీ పైడితల్లమ్మ మహోత్సవాలు ఆదివారం పుట్టబంగారం తీత కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్థానిక నూకాంబిక ఆలయం నుంచి ఉత్సవ ప్రతిమలను, ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగను జరుపుతారు. సోమవారం అర్ధరాత్రి దాటాక అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి జయదుర్గ బ్రహ్మోత్సవాలు

మల్కాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 61వ వార్డు పరిధి జనతా కాలనీలో వెలసిన జయదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం నవగ్రహ మండపారాధన, 7 గంటలకు నక్షత్ర హారతి ఇస్తారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర హారతి, 8కు పంచ హారతి, భజన కార్యక్రమాలను చేపడతామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. 6వ తేదీ ఉదయం 5 గంటలకు పూజ్య గురుదేవుల అన్నపూర్ణాంబ సహిత అమృతానందస్వామి ఆజ్ఞగా భక్తుల గర్భగుడి ప్రవేశం, భక్తులచే జయదుర్గ అమ్మవారికి పాలాభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి విగ్రహదాత సురుపల్లి మరియదాసు, మాణిక్యం దంపతుల ఇంటి వద్ద నుంచి అమ్మవారికి పసును కుంకుమలు, పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించడం జరుగుతుందన్నారు. 5 గంటలకు అమ్మవారి పాద దర్శనం, 7వ తేదీ ఉదయం 7 గంబలకు జయదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహంతో రాజరాజేశ్వరీదేవి దర్శనార్థం పలువురు భక్తులు దేవీపురం వెళతారు. 8వ తేదీ ఉదయం 11:45 గంటలకు పూర్ణాహుతి, అనంతరం అన్న సమారాధన చేపడతామని పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు అమ్మవారికి క్షీరాభిషేకం, రాహుకాలం పూజలు, సాయంత్రం 5కు మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, 10వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో మేళతాళాలతో వైభవంగా ఊరేగిస్తామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వెంకటాద్రి ముస్తాబు



విద్యుద్దీప కాంతుల్లో వెంకటాద్రి ఆలయం

పెందుర్తి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని శోభామయంగా ముస్తాబు చేశారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు విద్యుద్దీప కాంతులతో విరాజిల్లుతున్నాయి. బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీవారికి లక్ష తులసీపూజ, మల్లి పుష్పాలతో అర్చన, పద్మావతి, శ్రీనివాసుల కల్యాణం, వెంకటరమణునికి తిరువీధి ఉత్సవం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

14 నుంచి అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అయ్యప్పస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యదర్శి కేఎస్ఎన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామన్నారు. స్వామివారి ఊరేగింపుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

అగనంపూడి, మే 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడకు చెందిన తమ్మిన అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 81,800 మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఆయనకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పల్లెల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.